## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:324 | శనివారం జూన్ 27, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే

### ఈ మహమ్మారిని తరిమి కొట్టడంలో కలసి రండి


### ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు



సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

### 2047 నాటికి మాదకద్రవ్య రహిత

## భారత్ సాధనే లక్ష్యం




- మాదకద్రవ్య రహిత దేశమే ధ్యేయం
- విక్రేతలపై కఠినంగా వ్యవహరించాలి
- సాంకేతికతతో పటిష్ట నిఘా
- ఏపీలో ఈగిల్ విభాగం సేవలు
- రైల్వే నెట్‌వర్క్ పరిధిలో తనిఖీలు

**అమరావతి, జూన్ 26 :** వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, పోలీసు ఉన్నతాధికారులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు సరఫరా, విక్రయం చేసే వారిపై జీరో టోలరెన్స్ గా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**అవగాహన అవసరం**

హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలని అమిత్ షా పేర్కొన్నారు. ప్రత్యేక రోడ్డు మ్యాప్ ను రూపొందించుకోవడంతో పాటు కమ్యూనిటీ పోలీసింగ్ ను మరింత పెంపొందించుకోవాలని రాష్ట్రాలకు స్పష్టం చేశారు. అదే విధంగా మాదక ద్రవ్యాల సేవనం, సరఫరా, విక్రయాల వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు.

2లో

## డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం

- యువశక్తే దేశానికి పెట్టుబడి
- మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం
- స్నేహితుల ఒత్తిడి వల్లే వ్యసనాలు
- 'ఈగిల్' టాస్క్ ఫోర్స్ ఘనత
- పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవు




2లో

## తులం బంగారం కాదు..

### తులం ఇనుము కూడా ఇవ్వరు: కేటీఆర్




2లో..

## 'ఫ్రైడే - డ్రైడే'

### రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలి: డిప్యూటీ సీఎం పవన్



2లో

## పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా



- మార్కెట్ పరిస్థితులపై నిరంతర నిఘా ఉంచాలి
- కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష
- కిలో పొగాకు రూ.200 కంటే తగ్గకుండా చూడాలి
- ఖరీఫ్ సీజన్ ఎరువుల లభ్యతపై పర్యవేక్షణ అవసరం
- రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం

**అమరావతి, జూన్ 26 :** వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని కలెక్టర్లను కోరారు.

2లో

## కలుషిత కోరల్లో వశిష్ట గోదావరి

నరసాపురం NARSAPURAM

### పుష్కరాలు సమీపిస్తున్న వేళ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

- నర్సాపురం వశిష్ట గోదావరి తీరం వెంబడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది.
- పుష్కరాలు సమీపిస్తున్నా నది తీరాల పరిశుభ్రతపై సంబంధిత శాఖలు తగిన చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.





2లో

భక్తులకు పవిత్ర స్నానం కోసం వచ్చే గోదావరిని కలుషితం చేయడానికి ఎవరికి హక్కు లేదు!

## ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తులతో దాడి.. తీవ్రగాయాలు



పెద్దపప్పూరు: అనంతపురం జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తులతో దాడి జరిగింది. పెద్దపప్పూరు మండలం వరదాయపల్లెలో ఈ ఘటన చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ వెంకట నారాయణపై దుండగులు కత్తులు, కొడవళ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం వెంకట నారాయణను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సంపాదకీయం

## ఫిరాయింపులు: భలే ఖరీదైన బేరాలు!

కాల వైపరీత్యం! నిన్నటిదాకా తాము విమర్శించిన పార్టీలోనే నేడు చేరిపోతున్న ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగిపోతోంది. ఇటీవల బెంగాల్, మహారాష్ట్రలో చోటుచేసుకున్న తృణమూల్ కాంగ్రెస్, శివసేన ఎమ్మెల్యే, ఎంపీల ఫిరాయింపులే అందుకు నిదర్శనాలు. ఎటువంటి సంకోచాలు లేకుండా.. చేరిన క్షణమే, ఆ పార్టీ నాయకులతో బహిరంగంగా, చాలా కాలం తరువాత కలుసుకున్న పాత మిత్రుల్లా వ్యవహరిస్తున్నారు! ప్రజలు ఏమనుకుంటున్నారనేది ఈ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పట్టడం లేదు!

నిజానికి ఫిరాయింపులు అనేవి కొత్త రాజకీయ పరిణామాలు కానేకావు. భారతదేశ రాజకీయాలలో పార్టీ ఫిరాయింపులకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. ఈ నీతిబాహ్య రాజకీయాల పట్ల ఇప్పుడు ప్రజల్లో ఎటువంటి పట్టింపు లేకపోవడమే దిగ్భ్రాంతికరం. ఫిరాయింపులకు పాల్పడినవారు తమను ఎన్నుకున్న ఓటర్లకుగానీ, విశాల ప్రజానీకానికిగానీ తమ నిర్ణయంపై ఎటువంటి వివరణ ఇవ్వడం లేదు. రాజకీయాలు వ్యాపార లావాదేవీల వ్యవహారమయ్యాయి. ఫిరాయింపుదారులకు, వారిని చేర్చుకున్న పార్టీకి మధ్య కుదిరిన ఒప్పందానికి షరతులు ఏమిటో ప్రతి ఒక్కరికీ తెలుసు. రాజ్య వ్యవస్థ ఆర్థిక వనరులు అందుబాటులో ఉండడమనేది కూడా సదరు ఒప్పందంలో భాగంగా ఉంటోంది. ఇటీవల పార్టీ ఫిరాయించిన శివసేన ఎంపీ ఒకరు ఇలా చెప్పారు: 'నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు సాధించుకోవాలంటే నేను పార్టీ మారడం తప్పనిసరి'.

ఫిరాయింపులను ప్రజల తీర్పును వంచించడంగా ఎవరూ ఇంకెంత మాత్రం భావించడం లేదు. అవి సాధారణ వ్యవహారాలైపోయాయి. అధికార సాధనకు ఫిరాయింపులూ మరొక మార్గమని ప్రజలు అంగీకరిస్తున్నారు! ఫిరాయింపులపై విమర్శలకు బీజేపీ మద్దతుదారులు అదే రీతిలో ప్రతిస్పందిస్తున్నారు: కాంగ్రెస్ విషయమేమిటి? దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ఫిరాయింపులు జరగలేదా? 'ఆయారామ్, గయారామ్' అనే పరిహాసం ప్రాచుర్యంలోకి వచ్చింది నరేంద్ర మోదీ అధికారంలోకి రావడానికి చాలా కాలం ముందే కాదూ?

'అవును' అనేదే పై ప్రశ్నలన్నిటికీ సమాధానం. ఫిరాయింపులు భారత ప్రజాస్వామ్యమంత పాతవి. కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రతిపక్షాల ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వాలను రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బర్తరఫ్ చేశారు. పదవుల కోసం పార్టీ మారిన శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయ అవకాశవాదం బాగా వర్ధిల్లింది. నాయకులు పార్టీలు మారడంపై విమర్శలు రావడం పరిపాటి. అయితే ఆ విమర్శలకు పాలకపక్షం వారు ప్రతిస్పందిస్తూ 'గతంలో మీరూ అదే చేశారు కదా' అని పాత విషయాలను బయటకు తీసి ఎత్తిపొడవడం కూడా అంతే పరిపాటి. నాయకులు పార్టీలు మారడం అనేది కొత్తేమీ కాదు. ఇప్పుడు అసలు సమస్యేమిటంటే ఆ ఫిరాయింపుల స్వభావం పూర్తిగా మారిపోవడమే. కాంగ్రెస్ హయాంలో ఆధిపత్య పార్టీ వ్యవస్థకు తార్కాణంగా ఫిరాయింపులు ఉండేవి. ఇప్పుడు ఒక సర్వాధిపత్య పార్టీని సృష్టించి సుస్థిరం చేసే వ్యూహంలో భాగంగా ఫిరాయింపులు జరుగుతున్నాయి.

నాటి నేటి ఫిరాయింపులలో ఈ వ్యత్యాసం సమకాలీన రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మార్పును వివరిస్తుంది. గత దశాబ్దకాలంలో నరేంద్రమోదీ, అమిత్‌షాల నేతృత్వంలోని బీజేపీ ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రంగా ఆవిర్భవించింది.

## కలుషిత కోరల్లో వశిష్ట గోదావరి:

### పుష్కరాలు సమీపిస్తున్న వేళ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

**నరసాపురం, జూన్ 26 (జనసముద్రం ప్రతినిధి):**
పవిత్ర వశిష్ట గోదావరి నది కలుషితమవుతోంది. 2027లో జరగబోయే గోదావరి మహా పుష్కరాలకు సన్నాహాలు మొదలవ్వాల్సిన తరుణంలో, నరసాపురం పరిసరాల్లో నది పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా నరసాపురం పంట్రేవు వద్ద నది కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంతో ఆశలు ఆవిరి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గోదావరి నదిని పరిశుభ్రంగా ఉంచాలని, పుష్కరాలను అద్భుతంగా నిర్వహించాలని పట్టుదలతో ఉన్నారు. ఆయన ఆశయాలకు భిన్నంగా స్థానిక మున్సిపాలిటీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యం, భక్తుల సౌకర్యాలను గాలికొదిలేసి, అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు.

### కలుషితమవుతున్న నది.. ప్రమాదకర స్థితిలో నీరు

నరసాపురం పంట్రేవు వద్ద గోదావరి తీరం చెత్తాచెదారంతో నిండిపోతోంది:
వ్యర్థాల కంపు: పాడైపోయిన ఫ్లెక్సీలు, వాడేసిన చెరకు పిప్పి, ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో కలుస్తున్నాయి.
మురుగు నీటి ప్రవాహం: శుద్ధి చేయని మురుగు నీరు నేరుగా నదిలోకి చేరుతుండటంతో నీటి నాణ్యత దారుణంగా పడిపోతోంది.

### ఆందోళనలో భక్తులు, ప్రజలు

రాబోయే పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే, పుష్కర సమయంలో పరిస్థితి ఏంటని భక్తులు ఆందోళన చెందుతున్నారు. కలుషిత జలాల్లో పుష్కర స్నానాలు చేయడం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

### తక్షణమే స్పందించండి: ప్రజల డిమాండ్

సంబంధిత శాఖల అధికారులు ఇప్పటికైనా నిద్ర వదిలి, కింది చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు:
యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య చర్యలు:
ఘాట్‌లు మరియు నది పరిసరాలను వెంటనే శుభ్రం చేయాలి.
మురుగు కట్టడి: నదిలోకి మురుగు నీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.
సమన్వయంతో పని: వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచుకుని, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.
ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పుష్కరాల నాటికి వశిష్ట గోదావరిని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని, లేనిపక్షంలో భక్తుల మనోభావాలు దెబ్బతినడమే కాక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

*ఈ వార్తా కథనంపై సంబంధిత అధికారుల స్పందన ఏ విధంగా ఉండబోతోందో వేచి చూడాలి.*

## ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టి సారించాలన్నారు. అమరావతిలో రాష్ట్ర కేంద్రీయ గ్రంథాలయంతో పాటు విశాఖలో జిల్లా కేంద్రీయ గ్రంథాలయం, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ఇందుకు సంబంధించిన భవన నమూనాలను మంత్రి పరిశీలించారు. వచ్చే నెలలో అమరావతిలో రాష్ట్ర కేంద్రీయ గ్రంథాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని లోకేశ్? తెలిపారు. విశ్వవిద్యాలయాల అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. వర్సిటీల్లో 1,523 అధ్యాపక పోస్టులకు లక్షా 89 వేల 316 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు. ప్రతి దరఖాస్తు డేటాను పరిశీలించాలని స్పష్టం చేశారు. వర్సిటీ యూనిట్‌గా నియామకాలు చేపడుతున్నందున సెలక్షన్ కమిటీల ఎంపికకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని తెలిపారు. పీఎం సేతు పథకం కింద రాష్ట్రానికి ఐదు క్లస్టర్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో ఉక్కు, నౌకల నిర్మాణం, పెట్రోకెమికల్ క్లస్టర్ ఏర్పాటుకు అర్సెలర్ మిట్టల్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు.

పునరుత్పాదక ఇంధనం, పార్మా, ఆక్వా, శ్రీసిటీ క్లస్టర్లలో పీఎం సేతు పథకం కింద ఐటీఐలను బలోపేతం చేయాలని సూచించారు. ఐటీఐలలో ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సంరక్షణ కోర్సులు పూర్తి చేసిన వారికి ఓంక్యాప్ ద్వారా జపాన్‌లో ఉద్యోగాలు కల్పించడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఓంక్యాప్ ద్వారా 146మందికి విదేశీ ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. ప్రతి 3 నెలలకోసారి నియోజకవర్గాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఉద్యోగ మేళాలతో ఇప్పటి వరకు లక్ష 30వేల మందికి ఉద్యోగులు కల్పించినట్లు అధికారులు చెప్పారు. ఉద్యోగ మేళాలను రాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది 1.06లక్షల మంది విద్యార్థులు వచ్చారని మంత్రి లోకేశ్?కు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 7 వేల 620 ప్రాథమికోన్నత బడులు ఉండగా 3వేల 515 పాఠశాలల్లో గరిష్ఠ సామర్థ్యం మేర విద్యార్థులు ప్రవేశాలు పొందారని చెప్పారు. విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగానే విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని, ఈ ఏడాది 159 పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మారాయని తెలిపారు. సెప్టెంబరు 5 నుంచి 175 లీప్ పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు గణితం, సామాన్యశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ఏఐ ట్యూటర్ విధానాన్ని ప్రీ పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## 'ఫ్రైడే - డ్రైడే'

### రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలి: డిప్యూటీ సీఎం పవన్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నియంత్రణ చర్యలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజ ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడారు.

ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని.. అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని పవన్ ఆదేశించారు. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా... దోమల వ్యాప్తిని కట్టడి చేయాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని.. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. దోమలు పెరిగితే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని.. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్ మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని.. పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు.

## డ్రగ్స్ బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు: భట్టి విక్రమార్క

ఈ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళ్తుంది" అని భట్టి విక్రమార్క అన్నారు.

## తులం బంగారం కాదు..

### తులం ఇనుము కూడా ఇవ్వరు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

పరిగి: ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగా పథకాలేవీ తేలేదన్నారు. రూ.12వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని.. విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన రేవంత్.. కనీసం లక్షాధికారులను చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వదని ఎద్దేవా చేశారు.



### 2047 నాటికి మాదకద్రవ్య రహిత

## భారత్ సాధనే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

**రాష్ట్రంలో పటిష్ట నిఘా**
విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఏపీలో ఈగిల్ పోలీసు విభాగం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ఒకప్పుడు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని వివరించారు.

**సురక్షిత డేటా సెంటర్**
రైల్వే నెట్‌వర్క్ ద్వారా జరిగే రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు, ఈగిల్, శునక దళాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సాయి ప్రసాద్ తెలిపారు. మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకమైన డేటా సెంటర్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ వీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఎస్పి కెయం. మహేశ్వర రాజు, ఎన్సిబి అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం




మొదటిపేజీ తరువాయి

**విజయవాడ, జూన్ 26:**
దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివృద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి యువతకు, తల్లిదండ్రులకు కీలక సందేశాన్ని ఇచ్చారు. మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు.

**యువత అప్రమత్తంగా ఉండాలి**
దేశంలో దాదాపు 3.5 నుండి 4 కోట్ల మంది గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, ముఖ్యంగా 13 నుండి 18 సంవత్సరాల వయస్సు వారు ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారని హోం మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం స్నేహితుల ఒత్తిడి వల్లే 60 నుంచి 70 శాతం మంది వీటికి బానిసలవుతున్నారని, ఇలాంటి అలవాట్లు చేసే స్నేహితులు శత్రువులతో సమానమని హెచ్చరించారు. ఎన్నో కష్టాలకోర్చి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను యువత అపహాస్యం చేయవద్దని కోరారు. గంజాయి రవాణా, సాగును అరికట్టడానికి 450 మంది సిబ్బందితో పనిచేస్తున్న 'ఈగిల్' టాస్క్ ఫోర్స్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని కొనియాడారు. గతంలో ఏజెన్సీ పరిధిలో జరిగిన గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించి ప్రస్తుతం 'జీరో కల్టివేషన్' సాధించామని స్పష్టం చేశారు.

**నిఘా, కఠిన చట్టాలు**
డ్రగ్స్ రవాణా చేసినా, దగ్గర పెట్టుకున్నా ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయని, పట్టుబడితే కనీసం ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హోం మంత్రి హెచ్చరించారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 1972 నెంబర్‌కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ దుర్వినియోగం పెరగడం ఆందోళనకరమని, దీనిని మొక్కలోనే తుంచివేయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ప్రతి ఒక్కరూ డిజిటల్ ప్రతిజ్ఞలో భాగస్వామ్యం కావాలని కోరారు.

**డ్రగ్స్ రహిత సమాజం**
20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత పర్యవేక్షణలో గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. 'ఆపరేషన్ గరుడ', 'ఆపరేషన్ ఈగల్', 'ఆపరేషన్ వజ్రాయుధం' ద్వారా డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. ఈగల్ వింగ్ ఎస్పీ కె. నగేష్ కుమార్ మాట్లాడుతూ, యువతను రక్షించడం కోసమే ఈగల్ అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని, డ్రగ్స్ వ్యాపారం చేసేవారు వెంటనే రాష్ట్రం విడిచి వెళ్ళాలని హెచ్చరించారు. అనంతరం నా దేశాన్ని మాదక ద్రవ్యరహితంగా మార్చడానికి కృషి చేస్తానని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశా, ఎస్పీ జి. స్వరూపారాణి, అధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

మొదటిపేజీ తరువాయి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, కలెక్టర్లు, అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, ఎరువుల పంపిణీ ఏర్పాట్లపై సమీక్షించారు.

**ధరల పర్యవేక్షణ, ఎరువుల లభ్యత**
పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణాపై పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఉత్పత్తి పరిమాణం నిర్ణయం**
ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి ప్రస్తావించారు. 2026-27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యం**
రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

# వైటిపిఎస్ లోని సిహెచ్ పి మరియు ఏహెచ్ పి భాగాలను ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలి...

- స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి..
- వైటీపీఎస్ ఉద్యోగ జేఏసీకి సిపిఐ సంపూర్ణ మద్దతు.
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు..

దామరచర్ల మండలం.జూన్ 26.(జనసముద్రం న్యూస్):



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లోని యాష్ ప్లాంటు కోల్ ప్లాంటు ప్రైవేటీకరణ టెండర్లను ఉపసంహరించుకుని స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మరియు సిపిఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు,మండల పరిధిలోని వీర్లపాలెం వైటిపిఎస్ ప్లాంట్ మెయిన్ గేటు వద్ద దామరచర్ల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్థానికులకు ఉద్యోగ కల్పన ఏర్పాటు చేయాలని నిరసన వ్యక్తం చేశారు,ఇట్టి సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లోని స్టేజి 1,2 యూనిట్లకు సంబంధించి ఆపరేషన్,మెయింటెనెన్స్,మెకానికల్,ఎలక్ట్రిక్ పనులను ఉద్యోగుల కొరతను సాకుగా చూపిస్తూ రానున్న మూడు సంవత్సరాల కాలానికి గాను ప్రైవేట్ కాంట్రాక్టర్లు అప్పగించేందుకు టెండర్లను ఆహ్వానించడం సమంజసం కాదన్నారు,ఈనెల 12 నుంచి 29 వరకు టెండర్ల గడువు ప్రకటన చేశారని విద్యుత్ సమస్యతో సతమతమవుతున్న తెలంగాణకు మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో సుమారు 35 వేల కోట్ల భారీ వ్యాయంతో యాదాద్రి పవర్ ప్లాంట్ ను ప్రారంభించారని తెలిపారు,నాలుగు యూనిట్లు సిఓడి చేయగా ప్రస్తుతం ఐదో యూనిట్ పనులు శరవేయంగా సాగుతున్నాయని పేర్కొన్నారు,ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తిచేసి మొత్తం 4 యూనిట్లను ప్రారంభించగా ఒక్కొక్క యూనిట్ నుంచి ఎనిమిది వందల మెగావాట్ల చొప్పున నాలుగు యూనిట్ల ద్వారా 3200 మెగావాట్ల విద్యుత్ అందించే సామర్థ్యాన్ని సాధించిందని దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ ప్లాంటును ప్రైవేటుపరం చేయడం వల్ల స్థానిక నిరుద్యోగ యువత ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ప్రైవేటీకరణను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు,చుట్టూ ఉన్న గ్రామాల ఇల్లు భూ నిర్వాసిత ప్లాంట్ ప్రభావిత గ్రామాల యువకులు నిర్వాసితులు ఇప్పటికే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం స్పందించలేదని ప్లాంట్ నిర్వహణకు 4,000 మంది సిబ్బంది అవసరం ఉండగా 1262 మంది మాత్రమే పంపిస్తున్నారని దీంతో ఉత్పత్తి తీవ్ర ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్న అవసరమైన ఉద్యోగాలు నియమించడంలో ఆలస్యం చేస్తున్నారని భూనిర్వాసితులకు సుమారు 500 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారని స్థానికంగా 2000 మందికి ఉపాధి కల్పిస్తామన్న మాటలు ఇప్పటికీ అమలు చేయలేదన్నారు,ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోగా ప్లాంట్ ను ప్రైవేటికరించే ప్రయత్నాలు చేస్తున్నారాని అట్టి ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని లేదంటే ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహిస్తామని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్,సిపిఐ సీనియర్ నాయకులు జమ్ముల కోటయ్య,గజ్జల లక్ష్మి నరసింహ రెడ్డి,పెదపాక వెంకటేష్,పవన్,గాంధీ,కాశయ్య,రమేష్,సత్యానందం,సూర్యం,మహేష్ బాబు,రాము,రవి నాయక్,కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్: ముప్పు శ్రీనివాస్

ఎల్కతుర్తి జూన్ 26(జనసముద్రం)




హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు సాగింది.ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డ్రగ్స్ సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు పెను ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్న ఆయన, గ్రామాలు మరియు మండలాలు డ్రగ్స్ రహితంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం... యువత భవిష్యత్తును కాపాడుకుందాం" అనే నినాదంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు సీలం అనిల్ కుమార్, ఎంపీ డైరెక్టర్లు గౌడిశాల రాజయ్య, బచ్చు బాపురావు, అంబాల శ్రీకాంత్, మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్, సీనియర్ నాయకులు బొల్లెపోగు రమేష్, గౌడిశాల అర్జున్, మండలంలోని కాంగ్రెస్ సర్పంచులు, పుల్లూరి శ్రీధర్ రావు, రవీందర్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం...!!

- ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు.
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి గారి ఆదేశం
- 50 ఏళ్లకు పూర్వం నడిచే దైవం కంచి స్వామి వారి ఆధ్వర్యంలో భద్రాద్రి లోనిర్వహించిన ఆలయ పునరుద్ధరణ (కుంభాభిషేకం) జరిగిన విధంగా ప్రస్తుత రామాలయం పునరుద్ధరణ కూడా కంచి పీఠాధిపతులు మరియు రామానుజాచార్య స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

జనసముద్రం న్యూస్ జూన్ 26 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.





తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిగారు ప్రకటించారు.

గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

భద్రాచలం శ్రీ రాముని ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి అన్ని పనులు చేపట్టాలని సూచించారు.

దక్షిణ అయోధ్యగా ప్రఖ్యాతిగాంచిన భద్రాచలం రామాలయ0 సర్వాంగ సుందరంగా ఆగమ శాస్త్ర ప్రకారం నభూతో న భవిష్యతి అనే విధంగా రూపుదిద్దుకోవడానికి కంచి స్వామీజీ మరియు రామానుజాచార్య స్వామివార్ల ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రామ భక్తులు కోరుతున్నారు.

# దండేపల్లిలో దెబ్బతిన్న మెయిన్ పైప్‌లైన్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

- ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్ అప్రమత్తం

ఎల్కతుర్తి జూన్ 26(జనసముద్రం)



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో గ్రామ సర్పంచ్ గోలిపెల్లి సంపత్ వెంటనే స్పందించి మరమ్మతు పనులను పర్యవేక్షించారు.గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని వాటర్ ట్యాంక్ మెయిన్ పైప్‌లైన్ ఆకస్మికంగా దెబ్బతినడంతో గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న వెంటనే సర్పంచ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, అధికారులకు మరియు సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కార్మికులు యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. వీలైనంత త్వరగా నీటి సరఫరాను పునరుద్ధరించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా సర్పంచ్ గోలిపెల్లి సంపత్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఎలాంటి మౌలిక సదుపాయాల సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు.గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, గ్రామస్థుల సహకారంతో అన్ని సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

# హిందూ--ముస్లిం సోదరభావంతో దండేపల్లిలో ఘనంగా పీర్ల పండుగ నిర్వహణ



ఎల్కతుర్తి, జూన్ 26(జనసముద్రం)

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో ముస్లిం సోదరులు ఘనంగా పీర్ల పండుగను నిర్వహించారు.పీర్లను అందంగా అలంకరించి డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ముస్లిం పెద్ద ఎండి వాజిద్ పాషా మాట్లాడుతూ పీర్ల పండుగ మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు.హిందూ--ముస్లిం సోదరభావంతో అందరూ కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. హుస్సేన్, హసన్ త్యాగాలను స్మరించుకుంటూ ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు.ముస్లిం సోదరులు, సోదరీమణులు, పెద్దలు, చిన్నారులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ వేడుకలో గ్రామస్తులు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సామరస్యాన్ని చాటారు.

# ముప్పు శ్రీనివాస్‌కు యూత్ కాంగ్రెస్ ఘన సత్కారం

ఎల్కతుర్తి జూన్ 26(జనసముద్రం)



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ముప్పు శ్రీనివాస్‌కు యూత్ కాంగ్రెస్ నాయకులు ఘన సత్కారం నిర్వహించారు.న్యూస్ ఎల్కతుర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబాలా శ్రీకాంత్ మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పొన్నం ప్రభాకర్ సూచనలు, ఆశయాలకు అనుగుణంగా ప్రజల ఆకాంక్షల సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. నూతన మండల అధ్యక్షుడి నాయకత్వంలో సమాజ శ్రేయస్సు, పార్టీ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామని నాయకులు భరోసా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఈర భీమ్‌రాజ్, చిలుముల వినోద్ కుమార్, అల్లకొండ బాలస్వామి, మనోజ్, రానా, అభిలాష్, కళ్యాణ్, సందీప్, సాయి, ప్రసన్న, చింటు, వేణు, సుమన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక మొహర్రం

- కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య

జన సముద్రం న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రూరల్ ప్రతినిధి జూన్26



మున్నూరుకాపు మండల అధ్యక్షుడు కచ్చకాయల బాలరాజు కోనరావుపేట మండల మున్నూరుకాపు మండల అధ్యక్షుడు కచ్చకాయల బాలరాజు మండలంలోని ముస్లిం సోదరసోదరీమణులకు మొహర్రం శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ సందర్భంగా మాట్లాడుతూ పీర్ల పండుగ మహమ్మద్ ప్రవక్త మనుమడైన హుసేన్ ఇబ్న్ అలీ కర్బలా యుద్ధంలో చేసిన త్యాగానికి మరియు అమరత్వానికి ప్రతీకగా దీనిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు అన్నారు పీర్ల పండగలో అలావా ఆట ప్రధాన ఆకర్షణగా నిలుస్తోందని పెద్ద కట్టెలతో వెలిగించిన అలావా చుట్టూ తిరుగుతూ పాటలు పాడటం ఆనవాయితీరాత్రి వేళల్లో యువత మరియు గ్రామస్తులు కులమతాలకు అతీతంగా అందరు కలిసి అలావా ఆడుతూ అందరు ఐక్యమైత్యంగా ఉంటారన్నారు తెలంగాణ ప్రాంతంలో కులమతాలకు అతీతంగా పీర్ల పండుగ' జరుపుకుంటారుఈ పండుగ పల్లెల్లో మత సామరస్యాన్ని తెలియజేస్తూ త్యాగం ధర్మం సహనం ఐక్యం వంటివి తెలియజేస్తుందన్నారు అందరం కలిసి ఉందాం.

# వర్షాలకోసం గ్రామ దేవతలకు జలాభిషేకం చేసిన సూరారం మహిళలు





ఎల్కతుర్తి, జూన్ 26(జనసముద్రం)

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో గ్రామ దేవతలకు మహిళలు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు.సూరారం గ్రామ సర్పంచ్ భాషాబోయిన నీలా కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నీలా కొమురయ్య మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామ ప్రజలు పాడిపంటలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వర్షాలు కురిస్తే రైతులతో పాటు సకల జీవరాశులు, సమస్త ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్, మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి సంపత్ రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు

ఎల్కతుర్తి, జూన్ 26(జనసముద్రం)



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో మొహరం పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ముస్లిం సోదరులు సంప్రదాయబద్ధంగా మతపరమైన ఆచారాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పీర్లను అందంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో ముస్లిం మత పెద్దలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భక్తులు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.పీర్ల దర్శనానికి వచ్చిన ప్రజలు భక్తిపూర్వకంగా నమస్కరించి శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, గ్రామ పెద్దలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని సామరస్యాన్ని చాటారు.

# ఓటర్ల జాబితా పరిశీలనలో చురుగ్గా పాల్గొన్న టీడీపీ నేతలు.

జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 26 ద్వారకాతిరుమల ప్రతినిధి.



ద్వారకాతిరుమల మండలంలోని 197వ నంబర్ పోలింగ్ బూత్ కేంద్రంలో ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో సవరణలు, కొత్త పేర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరై బిఎల్ఓ , బిఎల్ఏ లతో కలిసి ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని వారు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, ద్వారకాతిరుమల మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మటపర్తి రూపేష్ కుమార్ ,ద్వారకాతిరుమల గ్రామ టీడీపీ ఉపాధ్యక్షులు గువ్వల మావుళ్ళు రావు, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి అందుగుల రాములు, బూత్ ఏజెంట్ వరిగేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ఆయన అజెండా

- రెండేళ్లలో రూపుమారిన కావలి నియోజకవర్గం
- ఎమ్మెల్యే కావ్యపై ప్రశంసల జల్లు

**నెల్లూరు, జూన్ 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అంటే అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్.. దశాబ్దాల కాలంగా పేరుకుపోయిన సమస్యలకు రెండేళ్లలో పరిష్కారం చూపిన ఘనత కావలి ఎమ్మెల్యేదే.. గత ఎన్నికల్లో రికార్డు స్థాయి మెజారిటీతో కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డి భారీ విజయం సాధించారు. కావలి నియోజకవర్గ చరిత్రలో అంతకుమునుపెన్నడూ అంత భారీ మెజార్టీ సాధించిన అభ్యర్థి ఎవరూ లేరు. తెలుగుదేశం అభ్యర్థిగా అనూహ్యంగా కావలి నుంచి బరిలోకి దిగిన కావ్యకృష్ణారెడ్డి అప్రతిహత విజయం సాధించారు.

### అభివృద్ధిపైనే దృష్టి

కావ్య కృష్ణా రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించారు. తొలుత నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లపై దృష్టి సారించారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన కావలి - తుమ్మలపెంట రోడ్డుకు మోక్షం కలిగించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఉన్నపుడు 1999లో కావలి




తుమ్మలపెంట రోడ్డును తారురోడ్డుగా వేశారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు రోడ్డు నిర్వహణను పూర్తిగా వదిలేశారు. దాంతో దశాబ్దాల పాటు రోడ్డు నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. గత వైసిపి హయాంలో ఈ రోడ్డు గురించి పూర్తిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే తుమ్మలపెంట రోడ్డుకు మోక్షం కలిగించి 25గ్రామాల ప్రజల చేత ఎమ్మెల్యే శెభాష్ అనిపించుకున్నారు. రోడ్డు పనులు 90శాతం మేర పూర్తయ్యాయి. దగదర్తి చెన్నూరు రోడ్డు కు కూడా మహర్దశ పట్టించాడు. ఈ రోడ్డు పనులు కూడా 85శాతం మేర పూర్తయ్యాయి. రైల్వే అండర్పస్ లు కూడా మంజూరు చేయించి కొన్ని పూర్తి చేశారు. ప్రతి మత్యకార గ్రామం నుంచి సముద్రతీరానికి కనెక్షన్ రోడ్లు మంజూరు చేయించారు. ఇటీవల సిఎం చంద్రబాబు కావలి తుమ్మలపెంటకు వచ్చినప్పుడు ఈ రోడ్లకు నిధులు మంజూరు చేయించారు. మండలం

### కావలి పట్టణంలో..

కావలి పట్టణంలో కూడా అభివృద్ధి పనులు పరుగులెత్తిస్తున్నారు ఎమ్మెల్యే.. కావలి కొత్త శివాలయం వద్ద సిమెంటు రోడ్డు మంజూరు చేయించారు. పట్టణంలోని భాష్యం స్కూల్ వద్ద నుంచి మద్దూరుపాడు సెంటర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో అంతర్గత సిమెంటు రోడ్లు వేయించారు. పట్టణంలోని గవర్నమెంట్ ఆస్పత్రిలో సిమెంటు రోడ్డు, పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేయించారు. బృందావనం కాలనీ నుంచి ముసునూరు వరకు రోడ్డు విస్తరణ పనులకు నిధులు సాధించారు. మందాడి చెరువును కూడా అభివృద్ధి చేసేందుకు నిధులు సాధించారు. కావలి పట్టణంలో మురుగునీటి గుంటగా ఉన్న అన్నపుగుంటను పూడిక తీయించి మోక్షం కలిగించారు. ఇలా దశాబ్దాలుగా నానుతున్నసమస్యలకు మోక్షం కలిగించారు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..

## మహబూబ్ సుభాని దర్గాలో ఉర్సు గుట్టపై మటికిలకు ప్రార్థనలు

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ జూన్ 26**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో మొహరం వేడుకల్లో భాగంగా ఉర్సు గుట్టపై పీరీల మటికీలకు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేతోలు గ్రామంలో ఉర్సు గుట్ట పై ఉన్న మహబూబ్ సుభాని దర్గా వద్ద అలాగే పీరీల కొట్టంలో ఉన్న అగ్నిగుండం చుట్టూ భక్తులు మటికీలతో తిరుగుతూ ప్రార్థనలు ఫాతిహాలు నిర్వహించి. అనంతరం పానకం పంపిణీ చేశారు. మత పెద్ద షేక్ యూసుఫ్ మాట్లాడుతూ. గ్రామంలో ప్రతీ ఒక్కరు ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నారు.



బేతోలు గ్రామ శివారులోని ఉన్న భజన తండా. మాన్సింగ్ తండా. చంద్ర నగర్ కాలనీలలో పీరీలను ఊరేగి స్తుండగా భక్తులు రంగుల పట్టిలు. కుడకలు. బెల్లం. ఊదు. కానుకలు సమర్పించారు. చివరి రోజు బేతోలు గ్రామంలో శనివారం మొహరం (షహదత్) నిర్వహిస్తారని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ఆయా వేడుకల్లో ముస్లిం మత పెద్దలు. షేక్ మస్తాన్. షేక్ మైనోద్దీన్. షేక్ షేక్అలీ. షేక్ మైబు. షేక్ జబ్బర్ మియా. బాల్ సైదు. షేక్ ఫకీర్. షేక్ మదర్. షేక్ హైమద్, షేక్ యాకూబ్ మియా. షేక్ జానీ మియా. షేక్ లతీఫ్. షేక్ ఖాదర్ బాబా. షేక్ జావిద్. షేక్ పాషా. షేక్ ఖాజా. షేక్ ఇమ్రాన్. తదితరులు పాల్గొన్నారు.

## పద్ధతి మార్చుకోండి లేదంటే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు
## రౌడీషీటర్లకు డీఎస్పీ అరుణ్ కుమార్ కౌన్సిలింగ్

**జనసముద్రం న్యూస్ జూన్:26 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి:**

ఉబ్బనపల్లి ప్రసాద్ భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ అరుణ్ కుమార్ శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించారు రౌడీషీటర్ల ప్రవర్తన ప్రస్తుతం వారు అనుసరిస్తున్న జీవన విధానంపై డీఎస్పీ ఆరా తీశారు అలాగే వారు ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారో వివరాలు తెలుసుకుని భవిష్యత్లో వారి ప్రవర్తన ఎలా ఉండాలనే అంశంపై సూచనలు చేశారు

ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ




పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు గత నేరాలను పూర్తిగా విడనాడి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని రౌడీషీటర్లకు సూచించారు వారి కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంటుందని ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు పట్టణంలో ఎలాంటి అలజడి సృష్టించకుండా శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించే వారిని రౌడీషీటర్ల జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు లేనిపక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు ఎస్ లు పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం ,

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 26, 2026:**

మంచిర్యాల జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మంచిర్యాల డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, గుడిపేట 13వ పటాలం కమాండెంట్ లతో కలిసి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి, యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని, అందరం సమిష్టిగా కృషి చేసి మంచిర్యాలను మాదకద్రవ్య రహిత మంచిర్యాల జిల్లాగా తీర్చిదిద్దుదామని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, మాదకద్రవ్యాలకు






సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు.

మంచిర్యాల డి.సి.పి. ఏ. భాస్కర్, మాట్లాడుతూ మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధించడం జరుగుతుందని, ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100లో సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులను పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, జూన్ 26;**

మాచర్ల పట్టణ పరిధిలోని మండాది రోడ్డు, నగరవనం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులతో మాట్లాడి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని



హామీ ఇచ్చారు.

అలాగే ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇట్లు,
ఓర్సు క్రాంతి కుమార్
భారతీయ జనతా పార్టీ
మాచర్ల పట్టణ అధ్యక్షుడు

## నేటి వేంకటేశ్వరుని దర్శనానికి భక్తులకు ముమ్మర ఏర్పాట్లు...

**జనసముద్రం న్యూస్ బుదగడం నియోజవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జూన్. 26.**

మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని శనివారం దర్శించుకోనున్న భక్తకోటికి శుక్రవారం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి జరిగే ప్రత్యేక పూజలు, విశేషాభిషాకాలతో పాటు బేడీ ఆంజనేయ స్వామివారి వార్షికోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రత్యేక ఏర్పాట్లు



చేస్తున్నారు. అలాగే వేలాది భక్తులు విచ్చేస్తున్న ఈ ఆలయంలో ఎండలో భక్తులెవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలువ పందిళ్లతో పాటు మంచినీరు, అన్నసమారాధన ఏర్పాట్లను బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షిస్తున్నారు.

## శ్రీ కొండలమ్మకు లక్ష మల్లెల పూజ...



**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జూన్. 26.**

మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో లక్ష మల్లెల పూజను శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాభిషేకాలతో ప్రత్యేక పూజలను చేపట్టారు. తొలుత గణపతి పూజ, మండపార్చన అనంతరం లక్ష మల్లెలతో పుష్పార్చన మంత్ర పుష్పం, మణిదీప వర్ణన, భక్తి గీతాలు మరియు లలిత సహస్ర పారాయణం అనంతరం తీర్థప్రసాదాల వినియోగం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి



రామరాజు దంపతులు, దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు దంపతులు, ఈఓ ఆకుల కొండలరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్రబాబు, నూతలపాటి లక్ష్మీ పావని, పెన్నేరు నాగ వెంకట లీల శేఖర్ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ







**నెల్లూరు, జూన్ 26: జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

మొదటిరోజు రొట్టెల పండుగకు పోటెత్తిన భక్తులు,తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తర ప్రదేశ్ మొదలైన రాష్ట్రాలు, సూదూర ప్రాంతాల నుంచి భారీగా విచ్చేసిన భక్తులు,క్యూ లైన్లలో కొనసాగుతున్న భక్తుల రద్దీ,భక్తిశ్రద్ధలతో స్వర్ణాల చెరువు ఘాటు వద్ద రొట్టెలు మార్చుకుంటున్న భక్తజనంపటిష్ట ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం దర్గాలో విస్తృతమైన ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తులు

## పట్టుదలతోనే పేదరికం మాయం...

-- మండలంలో నిరుద్యోగ యువతకు బాసటగా మెయిల్ క్రిష్ణారెడ్డి...
-- నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు ఉద్యోగావకాశాల కల్పన...
-- కుప్పంతో పాటు డోకిపర్రులోనే స్కిల్ డెలప్మెంట్ సెంటర్...

**జన సముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం. ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జూన్. 26.**

సమాజంలో వచ్చిన అవకాశాలను పట్టుదల, కషితో అందిపుచ్చుకుంటే పేదరికం మాయమవుతుంది. మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో పీ4(పబ్లిక్-- ప్రైవేట్ -- పీపుల్ -- పార్టనర్షిప్) కింద మార్గదర్శి మెయిల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శిక్షణార్థులకు శిక్షణ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గం కుప్పం తర్వాత నిరుద్యోగ యువతకు శిక్షణను ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించే స్కిల్ డెవలెప్మెంట్ సెంటర్ ఒక్క డోకిపర్రులోనే ఉందంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. గుడ్లవల్లేరు మండలంలోని యువకుల కొరకు డోకిపర్రులో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు నైపుణ్య అభివద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు ఆ కేంద్రంలో చాలా మంది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల బ్యాచ్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం పేరుతో ఈ పీ--4 కార్యక్రమాన్ని చేపట్టింది. సమాజంలో కష్టపడి ఒక ఉన్నత స్థానానికి వచ్చిన వ్యక్తులు తనలాగా తపన పడి పేదరికం నుండి బయటపడాలనే బంగారు కుటుంబాల వారికి సహాయం చేసేందుకు పీ--4 మార్గదర్శులు ముందుకు వస్తున్నారు. అందులో భాగంగా గుడ్లవల్లేరు మండలాన్ని దత్తత తీసుకున్న మెయిల్ వారు ఒకరు. ఒకసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించినప్పుడు పీ--4 కార్యక్రమం గురించి మెయిల్ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డికి వివరించి మార్గదర్శిగా ఉండాలని కోరారు. దానితో నైపుణ్య శిక్షణ అభివద్ధి కేంద్రం రూపు దాల్చింది. గుడ్లవల్లేరు, డోకిపర్రు పరిసర



ప్రాంతాల్లో నిజంగా జీవితంలో ఎదగాలనే ఆలోచనతో శిక్షణా తరగతులకు రావడం సంతోషదాయం. అందరూ బాగా శిక్షణ పొంది పేదరికం నుండి బయట పడేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. నైపుణ్య శిక్షణ అవకాశాలు వచ్చినప్పుడు శ్రద్ధతో నేర్చుకుని జీవితంలో మంచి స్థానంలో స్థిరపడాలి.

శిక్షణకు బ్యాచ్లు...
-- డీకే బాలాజీ, కష్ణాజిల్లా కలెక్టర్

మెయిల్ వారు ఏర్పాటు చేసిన నైపుణ్య అభివద్ధి కేంద్రంలో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల తొలి బ్యాచ్కు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం పేరుతో పీ--4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. సమాజంలో కష్టపడి ఒక ఉన్నత స్థానానికి వచ్చిన వ్యక్తులు తమ వలె తపన పడి పేదరికం నుండి బయటపడాలనే బంగారు కుటుంబాల వారికి సహాయం చేసేందుకు పీ--4 మార్గదర్శులు మెయిల్ అధినేత కష్ణారెడ్డి వలె ముందుకు వస్తున్నారు.

కుప్పం తర్వాత ఇక్కడే సదవకాశం...
-- ఎండీ ఇమ్రాన్, గుడ్లవల్లేరు ఎంపీడీఓ

రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కుప్పంతో ఒక్క డోకిపర్రులోనే ఈ విధంగా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు ఇచ్చే అవకాశం ఉంది. ఈ విధంగా నిరుద్యోగులకు సదవకాశాలు ఇవ్వటమే కాకుండా ఎంతోమందికి పీ--4 కింద మెయిల్ క్రిష్టారెడ్డి ఉపాధి మార్గాలను కూడా చూపుతున్నారు.

అభిరుచులను బట్టే శిక్షణ...
-- బి.చింతయ్య, మెయిల్ పీ4 ప్రాజెక్ట్ మేనేజర్

నిరుగ్యోగ యువతకు వారి అభిరుచులను బట్టే శిక్షణ ఉంటుంది. కేవలం శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలను ఇవ్వటమే కాకుండా వారికి తగిన వసతులను కూడా మెయిల్ సంస్థ కల్పిస్తోంది. శిక్షణ పొందేటపుడు యువతకు స్టైఫండ్తో పాటు భోజన వసతులు కల్పించటం జరుగుతోంది. శిక్షణ పూర్తి కాగానే ఉద్యోగావకాశాలను వెంటనే మెయిల్ చేస్తుందని తెలిపారు.

# శ్రీ వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవ అధికారుల సమీక్ష సమావేశం

- రాజకీయాలకు అతీతంగా నర్రవాడ శ్రీ వెంగమాంబ దేవాలయ అభివృద్ధికి సహకరించాలి ఎమ్మెల్యే కాకర్ల సురేష్
- రూ.12 కోట్లతో శ్రీ వెంగమాంబ దేవస్థాన సమగ్ర అభివృద్ధి పనులు
- మొదటి విడతగా రూ.6 కోట్ల నిధుల మంజూరు
- బ్రహ్మోత్సవాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి ఎమ్మెల్యే కాకర్ల

**నెల్లూరు, జూన్ 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

నర్రవాడ దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో నిర్వహించనున్న శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్



, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, నర్రవాడ శ్రీ వెంగమాంబ అమ్మవారి దేవస్థానం ఆధ్యాత్మిక, సాంస్కృతిక పరంగా విశిష్టమైన చరిత్ర కలిగిన పవిత్ర క్షేత్రమని పేర్కొన్నారు. ఈ దేవాలయ అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి ముందుకు తీసుకెళ్లాలని, భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గౌరవ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో శ్రీ వెంగమాంబ దేవాలయ సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా తొలి విడతగా రూ.6 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ నిధులతో ఆలయ ప్రాంగణ విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన, భక్తుల వసతి ఏర్పాట్లు, సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

అదేవిధంగా భక్తులకు రాకపోకలు మరింత సులభతరం చేయడానికి రూ.50 లక్షల వ్యయంతో దొడకొండకు రహదారి నిర్మాణ పనులు కూడా ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయిన అనంతరం నర్రవాడ క్షేత్రం రాష్ట్ర స్థాయిలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ) ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, అగ్నిమాపక చర్యలు వంటి అన్ని అంశాల్లో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులను సమకూర్చి, బ్రహ్మోత్సవాలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, సేవా సంస్థలు మరియు భక్తులు సమిష్టిగా కృషి చేసి శ్రీ వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించి, అమ్మవారి మహిమను మరింతగా చాటాలని సమావేశంలో కోరారు.

# భక్తులు కోరిన కోర్కెలు తీర్చే... కన్యకా పరమేశ్వరిఆలయం.

- కకుందుర్పికే తలమానికంగా కల్పవల్లి కన్యకా పరమేశ్వరి వాసవి.
- ఆలయ నిర్మాణానికి భక్తులు వితరణ దాతలు.
- ఆలయంను అత్యంత సుందరంగా నిర్మా ణం.
- అమ్మవారికి అర్చకులచే అనునిత్యం పూజలు..
- 2020లో ఆ ఆలయం ప్రారంభం.
- ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవంగా కన్యాక పరమేశ్వరి.
- పార్వతి ,ఉమామశ్వర, లక్ష్మి, నారాయణ ఉప ఆలయంలు వెలసిన వైనం.
- వినాయక, సుబ్రహ్మణ్యం స్వామి వారి విగ్రహలు భక్తులుకు దర్శనం.

**కుందుర్పి జూన్,26, జనసముద్రం న్యూస్ :**

భక్తులు భక్తిశ్రద్ధలతో నియమనిష్టితో కొలిచితే కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా కన్నకాపరమేశ్వరి దేవి వెదజల్లుతుంది అనడంలో అతిశయోక్తి లేదు.మండల కేంద్రమైన కుందుర్పి గ్రామానికే శ్రీ కన్యక పరమేశ్వరి వాసవి అమ్మ వారి దేవాలయం తలమానికంగా నిలిచింది నడంలో ఎలాంటి సందేహం లేదు. కుందుర్పిలో వెలసిన కన్యకా పరమేశ్వరి వాసవి అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో నియమ నిష్ఠితో పూజలు చేస్తే భక్తులు కోరిన కోరికలు నేరవేర్చేలా కల్పవల్లిగా , కొంగు బంగారంగా విరిజల్లుతుంది అనడంలో నమ్మకం భక్తుల్లో గట్టిగా కలదు. గ్రామ నడి ఒడ్డున ప్రధాన రహదారి ప్రక్కనే విశాలమైన స్థల ప్రాంగణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం 2020లో ఫిబ్రవరి 7న వేద పండితుల మంత్రాచరణ నడుమ అంగ రంగ వైభవంగా ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ సందర్భంగా ఆ కుందుర్పి గ్రామమంతా ఎటుచూసినా వివిధ రంగు రంగుల విద్యుత్ దీపాలతో చూపర్లను కన్నులు మిర్మిట్లు గొలపే విధంగా చూపర్లను విశేషంగా ఆలరించించి. పది రోజుల్లో పాటు నిరవధికంగా అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఈ ఆలయమం



ఐదారు ప్రాకారాలతో తూర్పుముఖ ముఖద్వారంతో దిశగా వెలిసింది. ప్రధాన ఆలయంలో కన్యక పరమేశ్వరి అమ్మవారు, ఇరు ప్రక్కల ఉన్న ఉప ఆలయంలో పార్వతి ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ఉత్సవ మూర్తులు వెలిశాయి. వీటి ప్రక్కనే వెలసిన ఉప ఆలయాలులో విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు ఎడమ ప్రక్కన,, కుడి ప్రక్కన శరణుభవ ధైర్యంను కల్పించే సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలను అప్పటిలో ప్రతిష్టించారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా సుందరమైన పరమేశ్వర శివుడు లింగోద్భవ రూపంలో వెలసిన శివలింగం, ఎదురుగా నంది విగ్రహంలు వెలసాయి. ఈ నల్లటి విగ్రహంలు అత్యంత సుందరంగా కళాకారులు మలచడం విశేషం. నల్లటి రాతితో శివలింగం ఎదురుగా నంది విగ్రహం మరియు నవగ్రహ విగ్రహాలను ఉత్సవ మూర్తులను ప్రతిష్టించారు. శివుడునీ భక్తులు పూజిస్తే ధనవంతులు అవతారని నమ్మకముంది అధికంగా ఉంటుంది. శివుడి ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదున్న నానుడీ భక్తులులో కలదు.తొలత భక్తాదులు కష్టాల ఎదుర్కొన్నప్పుడే తర్వాత సుఖం లభిస్తుంది. శని దోషం ఉన్నవారు,నవ వి గ్రహాల పనితీరు సరిలేని వారు నవగ్రహాలకు పూజలును భక్తి శ్రద్ధలతో చేస్తే , శని దోషం గ్రహాల పనితీరు నివారణ అవుతుందని భక్తులతో భక్తులలో గట్టి నమ్మకం కలదు. గర్భగుడి ఆలయం మూడు తలుపులకు స్వర్ణ మయంగా పూతరేకులను తొడిగేలా శోభాయ మానంగా అలంకరించారు. ఆలయ ముఖద్వారానికి పైన ఎదురుగా 10 అడుగుల ఎత్తు గల శ్రీ కన్యక పరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని అత్యంత సుందరంగా నిర్మించడం విశేషం. ఈ అమ్మవారు విగ్రహం ముఖ ద్వారం పైన వెలసడం చూపరులును ఇట్టే కట్టి పడేస్తుంది. ఈ అమ్మవారు ఆదిశక్తి జగజ్జనని విగ్రహం చూపర్లను భక్లులును కట్టిపడేసేలా విశేషంగా అలరిస్తుంది.అమ్మవారి విగ్రహ మూర్తి ఎదురుగా 50 అడుగుల దూరంలో వంద అడుగుల ఎత్తు కల సుందరమైన ధ్వజస్తంభంను ఏర్పాటు చేశారు. భక్తులు ఆర్యవైశ్యులు ఆర్థిక వితరణ దాతలు సహయ సహకారంతో ఈ అతి సుందరమైన ఈఆలయ నిర్మాణానికి సాధ్యం అయింది ని తెలుస్తుంది. కన్యకా పరమేశ్వరి లేదా వాసవి మాత దేవి అమ్మవారి అవతారంగా హిందువులచే పూజింపబడే ఒక దేవత మూర్తి. ఇమె ప్రధానంగా గోమతి లేదా ఆర్యవైశ్యుల కులస్తుల ఆరాధ్య కులదేవత. కన్యకా వాసవి పరమేశ్వరి ఆత్మ అర్పణ దినోత్సవంను ఆర్యవైశ్యులు అరాధ్య దైవం వాసవీ మాత ఆత్మగౌరవం,అహింస కోసం చేసిన త్యాగాన్ని స్మరించుకుని పవిత్రమైన రోజే. కన్యకా పరమేశ్వరి ఆత్మర్పణ దినాన్ని ప్రతిఏటా జనవరి నెలలో వాసవి జయంతిని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.



ఆలయం ప్రక్కనే భవిష్యత్తులో కళ్యాణమండపం నిర్మాణానికి స్థలాన్ని సేకరించి నిర్మించాలని గట్టి సంకల్ప లక్ష్యం పెట్టుకున్నారు మండల ఆర్యవైశ్యులు అందరు ఐక్యతతో సంఘం సభ్యులు వున్నారు. ఆ ఆలయం పై భాగాన సుందరమైన ఆదిశక్తి అమ్మవారి విగ్రహాలు ఆలయానికి నాలుగు దిశలు వివిధ రూపాల్లో అత్యంత సుందరంగా నిర్మించడం చూపర్లను విశేషంగా అలరిస్తుంది. అంతేకాకుండా ఆలయ గోపార శిఖరంను కళాకారులుచే అతి సుందరంగా నిర్మించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి అర్చకులు ఆలూరి,మహేష్, కరణం, భాస్కర్ల నేతృత్వంలో అనునిత్యం అమ్మవారికి, స్వామి వారికి విశేష పూజలు నోచు కోంటున్నాయి. అమ్మవారికి అనుదినం వేద పండితులచే పూజా కార్యక్రమాలు జరిగే వివరాలు ఇలా. అమ్మ దర్శన వేళలు ఉదయం 6:30 నుంచి 9:30 గంటలు వరకు, పూజా కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారికి అభిషేకం, తీర్థప్రసాదాలు , నైవేద్యం అమ్మవారికి సమర్పించేలా నిర్వహిస్తారు.. భక్తాదులు అమ్మవారికి బంగారు వెండి ఆభరణాలు వితరణ చేయడానికి ముందుకు కొస్తున్నారు అని ఆర్యవైశ్య సభ్యులు తెలిపారు. దసరా శరన్నవరాత్రులు ఆలయంలో వైభవ పేతంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే ఆలయంలో ప్రాకార, ఉయ్యాల పూజ, అభిషేకం, పసుపు కుంకుమార్చన, జలాభిషేకం, పుష్ప అలంకరణ, అన్నసంతర్పణ ,తీర్థ ప్రసాదాలను ఆర్యవైశ్య సభ్యులు చేపడుతారు. ఆలయంలో అప్పటి కుందుర్పి మాజీ గ్రామ సర్పంచ్, నాగేళ్ల సరస్వతి భర్త,నంజుంధప్పలు ఆధ్వర్యంలో నూతన ఆలయం నిర్మించిన విషయం పాఠకులకు విధితమే. ఈ స్థలం మునుపు కరణం, నరసింహమూర్తి ,మాజీ ఆలయ ధర్మకర్త ,వారి సింహయంతో నిర్మించిన గృహంను. ఈ స్థలంలో మండల ఆర్యవైశ్యులు సంఘటితంగా ఏర్పడి,అందరి ఐక్యతతో స్థలాన్ని కొనుగోలు చేసి ఆ స్థలములోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మించడం జరిగింది. ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘం, తాత్కాలిక అధ్యక్షుడుగా ఎన్ ,అనిల్ యువకుడు ముందుకు కొనసాగుతున్నారు. ఏదిఏమైనా భవిష్యత్తులో మన కుందుర్పిలో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి వాసవి దేవి మాత గొప్ప ఆలయం దిన దినాభివృద్ధి చెందాలని మనమందరం కోరుకొందాం.ఈ వార్త సేకరణను మలిచినది కుందుర్పి గ్రామం సినీయర్ జర్నలిస్ట్ బి, కోదండ రాములుని గమనించగలరు.

# మహబూబాబాద్ జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గుగులోత్ సురేష్ నియామకం

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ జూన్ 26**

మహబూబాబాద్, జిల్లా లో
భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం మహబూబాబాద్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గుగులోత్ సురేష్‌ను అధికారికంగా నియమించింది. పార్టీ బలోపేతం, గిరిజన హక్కుల పరిరక్షణ, గ్రామ స్థాయిలో బీజేపీ సిద్ధాంతాల విస్తరణలో ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

గుగులోత్ సురేష్ గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ గిరిజన యువత, రైతులు, సామాన్య ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో బీజేపీ సంస్థాగత బలోపేతానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పలువురు నాయకులు



అభినందించారు.

ఈ సందర్భంగా గుగులోత్ సురేష్ మాట్లాడుతూ,నాపై నమ్మకం ఉంచి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మరియు జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. గిరిజన సమాజ అభివృద్ధి, యువత సాధికారత, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మరింత కృషి చేస్తాను" అని తెలిపారు.

పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక నాయకులు గుగులోత్ సురేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో మహబూబాబాద్ జిల్లాలో బీజేపీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# చెరువుముందరపల్లె ప్రజలు,కార్యకర్తలతో మమేక మైన శ్రీకాంత్ రెడ్డి

**రామాపురం జనసముద్రం న్యూస్ జూన్ 26**



రామాపురం మండలం చిట్లూరు గ్రామం చెరువుముందరపల్లె లో ప్రజలు,కార్యకర్తలతో శుక్రవారంనాడు వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆత్మీయంగా మమేకమయ్యారు.ఆయన అందరినీ పేరుపేరునా పలకరించారు.వైఎస్ఆర్ సిపి నాయకుడు అవటాల ధర్మారెడ్డి కుమారుడు జగన్ మోహన్ రెడ్డి మోకాలికి చికిత్స చేయించుకుని విశ్రాంతి పొందుచున్నారు. వారి నివాసానికి శ్రీకాంత్ రెడ్డి వెళ్లి అతనిని పరామర్శించి,ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ సిపి నాయకుడు అదిరెడ్డి నివాసంలో తేనీటి విందును శ్రీకాంత్ రెడ్డి స్వీకరించారు.

మాజీ సర్పంచ్ మురళీ మోహన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ హరినాధ రెడ్డి,మాజీ సర్పంచ్ అయోధ్యాపురం నాగభూషన్ రెడ్డి, నారాయణ రెడ్డి, బశిరెడ్డి, రసూల్ ఖాన్,ష,బీర్, సగినాల శివసంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కిల్ ఇన్స్పెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కూటమి నేతలు



**మొగల్తూరు జూన్ 26 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**

నరసాపురం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆకుల రఘును శుక్రవారం మొగల్తూరు మండలానికి చెందిన కూటమి నాయకులు, మొగల్తూరు జల సంఘం ఉపాధ్యక్షుడు ముక్కు పుల్లయ్య నాయుడు, దొంగ స్వామి, దేశంశెట్టి శ్రీనివాస్ కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నరసాపురం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఆకుల రఘు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని వారు ఆకాంక్షించారు.

# కర్ణపువాండ్లపల్లెలో యువతతో శ్రీకాంత్ రెడ్డి ఆత్మీయ మమేకం

**రామాపురం జనసముద్రం న్యూస్ జూన్ 26**

రామాపురం మండలం కర్ణపువాండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి యువతతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా యువతతో కలిసి స్థానిక అంశాలపై చర్చించి, వారి అభిప్రాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ప్రాంత అభివృద్ధిపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. యువత ప్రజా సేవలో చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



# కోతుల నడుమ గ్రామంలో ఘనంగా వరుణ యాగం -- వర్షాల కోసం మహిళల జలాభిషేకం



**ఎల్కతుర్తి జూన్ 26(జనసముద్రం)**

సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ ఎల్కతుర్తి మండల పరిధిలోని కోతుల నడుమ గ్రామంలో శుక్రవారం గ్రామ మహిళలు ఘనంగా వరుణ యాగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యం కావడంతో ఇప్పటికే విత్తనాలు వేసి వానల కోసం ఎదురుచూస్తున్న రైతులకు అండగా గ్రామస్తులంతా ఏకమయ్యారు.ఉదయం గ్రామ మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, తలపై నీటి బిందెలతో ఊరేగింపుగా గ్రామ దేవతల ఆలయాలకు చేరుకున్నారు. గ్రామ దేవతలైన పోచమ్మ తల్లి, ఆంజనేయస్వామి, బొడ్డు రాయి, ఎల్లమ్మ తల్లి వద్ద ప్రత్యేక జలాభిషేకాలు నిర్వహించారు. వరుణ దేవుడి అనుగ్రహం కోసం నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, “ఈ ఏడాది వర్షాలు లేక రైతన్నలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.అందుకే గ్రామ దేవతలను శాంతింపజేయడానికి, లోక కల్యాణం కోసం ఈ పూజలు నిర్వహించాం” అన్నారు. రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.గ్రామ పెద్దలు మాట్లాడుతూ వ్యవసాయం సజావుగా సాగితేనే గ్రామ ప్రజల జీవనం సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురిసి వేసిన విత్తనాలు మొలకెత్తి రైతులకు మంచి దిగుబడులు రావాలని దేవుళ్లను వేడుకున్నట్లు తెలిపారు.భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో మహిళలతో పాటు గ్రామ పెద్దలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాలు భక్తుల జయజయధ్వానాలు, మంత్రోచ్ఛారణలతో మారుమోగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ పూజలతో వరుణ దేవుడు కరుణించి త్వరలోనే వర్షాలు కురిపిస్తాడనే విశ్వాసంతో గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కొరియోగ్రాఫర్‌ను కొట్టా.. ఇప్పటికీ బాధపడుతున్నా: అలియా

భారీ యాక్షన్ సన్నివేశాలతో అలరించడానికి సిద్ధమయ్యారు అలియా భట్, శార్వరీ వాఘ్. వీరు ప్రధానపాత్రల్లో శివ్ రావేల్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘ఆల్ఫా’. జులై 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా అలియా ఓ విషయాన్ని పంచుకున్నారు. యాక్షన్ సన్నివేశాలు ప్రాక్టీస్ చేసే సమయంలో తాను Alia Bhatt ఓ కొరియోగ్రాఫర్‌ను అనుకోకుండా కొట్టినట్లు తెలిపారు.‘అతడిని కొట్టిన వెంటనే నేను సారీ చెప్పా. నా వల్ల ఒకరికి దెబ్బ తగిలినందుకు చాలా బాధేసింది. అది గుర్తొచ్చినప్పుడల్లా ఇప్పటికీ బాధపడతాను’ అని చెప్పారు. అయితే, ఈ సంఘటనతో సినిమాలోని యాక్షన్ కొరియోగ్రఫీ ఎంత సహజంగా సాగిందో తెలుస్తోందని ఆమె అన్నారు. ఆల్ఫా (Alpha) తనకు జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. మునుపెన్నడూ చూడని పాత్రలో తాను నటించినట్లు చెప్పారు.ఇక ఈ సినిమాలో బాబీ దేవోల్ కూడా కీలకపాత్రలో కనిపించనున్నారు. అలియాతో యాక్షన్ సన్నివేశాలు చేసే సమయంలో తాను భయపడినట్లు చెప్పారు. ఆమె చాలా సన్నగా ఉంటారని.. ఎక్కడ దెబ్బ తగులుతుందోనని ప్రతి సన్నివేశాన్ని జాగ్రత్తగా చేసినట్లు తెలిపారు. అలియా ఇందులో యాక్షన్ సీన్స్ అదరగొట్టిందన్నారు. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ చిత్రాన్ని ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు.



## ‘ధురంధర్ 2’.. 100 రోజుల్లో వసూళ్లు ఎంతంటే?

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh) ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ‘ధురంధర్ 2: ది రివెంజ్’ (Dhurandhar The Revenge) థియేటర్లలో 100 రోజులు పూర్తి చేసుకుంది. మార్చి 19న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. ట్రేడ్ వర్గాలు తెలిపిన లెక్కల ప్రకారం ‘ధురంధర్ 2’ ప్రపంచవ్యాప్తంగా 100 రోజుల్లో రూ.1,813.38 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. ఈ విజయాన్ని పురస్కరించుకొని నిర్మాణ సంస్థ ‘జియో స్టూడియోస్’ శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేక పోస్ట్ పెట్టింది.2025 డిసెంబరు 5న ‘ధురంధర్’ విడుదల కాగా, దాని సీక్వెల్ ఈ ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక సినిమా విజయంపై దర్శకుడు ఆదిత్య ధర్ సతీమణి, నటి యామీ గౌతమ్ మాట్లాడారు. “ఈ విజయం మమ్మల్ని ఏమీ మార్చలేదు. ఆదిత్య చాలా వినయంగా ఉంటాడు. జీవితంలో విజయాలు, అపజయాలు, ఒడిదొడుకులు అన్నీ చూశాం. కానీ, ఎప్పుడూ నిరాశను బయటపెట్టలేదు. మేం దేవుడిని ఎంతగానో నమ్ముతాం. మంచి వారికి మంచే జరుగుతుంది. నీ కోసం రాసిపెట్టింది కొంత ఆలస్యమైనా తప్పకుండా దక్కుతుంది” అని అన్నారు. ‘ధురంధర్: రా&అన్‌దేఖా (పార్ట్ 1)’ (అన్‌కట్ వెర్షన్) నెట్‌ఫ్లిక్స్, జియోహాట్‌స్టార్‌లో విడుదలైంది. అంతర్జాతీయంగా 2026 మే 15న, భారత్‌లో మే 22న స్ట్రీమింగ్ అయింది. సీక్వెల్ అన్‌కట్, బీటీఎస్ వెర్షన్ ‘రా �д అన్‌దేఖా – ది రివెంజ్’ జూన్ 4న జియోహాట్‌స్టార్‌లో, జూన్ 19న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది.




## ‘జైలర్ 2’ పూర్తి చేసిన హృతిక్ రోషన్!





టైగర్ కా హుకూం.. అంటూ ‘జైలర్’ చిత్రంతో తనదైన స్టైల్‌లో సందడి చేశారు రజనీకాంత్. దీనికి సీక్వెల్‌గా ‘జైలర్ 2’ (Jailer 2) రూపొందుతోన్న విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ అగ్రకథానాయకుడు హృతిక్ రోషన్ అతిథి పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తయినట్లు సమాచారం. సెప్టెంబర్ 11న ఈ సినిమా విడుదల కానుంది.‘జైలర్ 2’ సినిమాతో రజనీకాంత్ (Rajinikanth), హృతిక్ రోషన్ మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారని అందరూ భావిస్తున్నారు. కానీ, దాదాపు 40 ఏళ్ల క్రితం ఈ ఇద్దరూ ఓ సినిమా కోసం స్క్రీన్ పంచుకున్నారు. 1986లో విడుదలైన ‘భగవాన్ దాదా’ అనే హిందీ సినిమాలో వీరిద్దరూ నటించారు. అప్పుడు పదేళ్ల వయసున్న హృతిక్ రోషన్ బాలనటుడిగా నటించాడు.ఈ సినిమాను హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్ నిర్మించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ఈ సినిమా గురించి హృతిక్ మాట్లాడుతూ.. తన పక్కన ఉన్నది భారతీయ సినిమాలోనే ఒక అతిపెద్ద లెజెండ్ అనే విషయం అప్పట్లో తెలియలేదన్నారు.

## మరో నాలుగు నెలల్లో ‘వారణాసి’ షూటింగ్ పూర్తి: రాజమౌళి



మహేశ్ బాబు (Mahesh Babu) అభిమానులకు రాజమౌళి గుడ్‌న్యూస్ చెప్పారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న ‘వారణాసి’ (Varanasi) షూటింగ్ మరో నాలుగు నెలల్లో పూర్తవుతుందని వెల్లడించారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విజువల్ వండర్‌గా ఉండబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ అంతా పూర్తయిన్నట్లు తెలిపారు.ఫ్రాన్స్‌లో జరిగిన ‘ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్’లో పాల్గొన్న రాజమౌళి (SS Rajamouli అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. “వారణాసిలో ముఖ్యమైన భాగాలను పూర్తిచేశాం. యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను షూట్ చేస్తున్నాం. ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది (Varanasi Update)” అని తెలిపారు.సినిమాను ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై మాట్లాడుతూ.. ఈ కథ ఐమాక్స్‌లో అయితే అద్భుతంగా ఉంటుందని మొదటే అనుకున్నట్లు చెప్పారు. అయితే, ఈ ఫార్మాట్ కోసం మాత్రం ‘వారణాసి’ కథలో మార్పులు చేయలేదని, చిన్న చిన్న సర్దుబాట్లు చేసినట్లు వెల్లడించారు. “మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌లో షూట్ చేయడానికి అలవాటు పడ్డాయి. నాకు కూడా అది ఇష్టమే. అయితే, మొదటి నుంచి మేము అనుకున్నది ఏంటంటే, అటు ఐమ్యాక్స్, ఇటు సినిమా స్కోప్‌నకు సరిపోయేలా సన్నివేశాలను ఫ్రేమ్ చేయాలనుకున్నాం. అదే అనోమార్ఫిక్ ఫ్రేమింగ్ (సినిమా ప్రదర్శితమయ్యే స్క్రీన్‌కు అనుగుణంగా ఇమేజ్/వీడియో క్వాలిటీ దెబ్బతినకుండా పెద్దదిగా చేయడం) దీంతో తొలిరోజుల్లో కొన్ని సర్దుబాట్లు చేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఏది ఎలా చేయాలో మాకు అర్థమైంది. దీంతో పని సులభంగా అయిపోయింది” అని జక్కన్న చెప్పుకొచ్చారు.మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తోన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో కుంభ పాత్రలో నటించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఇటీవల ఈ సినిమా గురించి మాట్లాడుతూ అంచనాలు పెంచేశారు. రాజమౌళి కొన్ని సన్నివేశాల కోసం ఏకంగా 90 టేక్స్ తీసుకున్నారని తెలిపారు.

# అక్కడా అదే లక్ష్యం



బాలీవుడ్‌లో ఒకప్పుడు విభిన్నమైన కథలతో అభిమానుల్ని అలరించింది కథానాయిక ప్రియాంక చోప్రా. ప్రస్తుతం ఇంగ్లిష్ చిత్రాలతో బిజీగా ఉంటున్న ఈ తార.. హాలీవుడ్‌లో ఇంకా చేయాల్సింది చాలా ఉందని అంటోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రియాంక.. తన హాలీవుడ్ కెరీర్ గురించి మాట్లాడుతూ.. “నా హిందీ సినిమా కెరీర్‌లో నేను భారతదేశంలోని అత్యుత్తమైన దర్శకులు, నటీనటులతో పనిచేశాను. అద్భుతమైన పాత్రల్లో భాగమయ్యాను. విభిన్నమైన జానర్లలో నటించా. కానీ హాలీవుడ్‌లో ఆ స్థాయి వైవిధ్యాన్ని, అలాంటి అవకాశాల్ని ఇంకా అందుకోలేదు. ఇండియాలో చేసినట్లు హాలీవుడ్‌లో కూడా ప్రయోగాత్మక పాత్రలు చేయడం, నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడమే నా తదుపరి లక్ష్యమ”ని అంది. “పెళ్లి, పిల్లలు తర్వాత మీ ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోతాయి. ఉద్యోగం చేస్తూనే తల్లిగా బాధ్యతలు నిర్వర్తించే జీవితాన్ని అనుభవిస్తున్నా. ఇప్పుడు మా అమ్మ మీద నాకు మరింత గౌరవం పెరిగింద”ని తన వ్యక్తిగత జీవితం గురించి చెప్పింది ప్రియాంక.

## ‘బాహుబలి-3’ వస్తుంది.. ప్రకటించిన ప్రభాస్



ప్రభాస్, రానా, అనుష్క, సత్యరాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఎపిక్ యాక్షన్ మూవీ ‘బాహుబలి (Baahubali Movie)’. రెండు భాగాలుగా వచ్చిన ఈ మూవీ టాలీవుడ్ సత్తాను ప్రపంచదేశాలకు తెలిసేలా చేసింది. తాజాగా ‘బాహుబలి: ది టార్చ్ బేరర్’ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే దీని స్ట్రీమింగ్‌కు ముందు నెట్‌ఫ్లిక్స్ ఓ వీడియోను ప్రదర్శించింది. అందులో సినీ ప్రియులకు సర్‌ప్రైజ్ ఇస్తూ ‘బాహుబలి 3’ (Baahubali 3) ఉంటుందని అధికారికంగా చెప్పారు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ‘ప్రపంచం ఈ ప్రకటనను ఊహించలేదు.. మీ అందరికోసం బాహుబలి మూడో భాగం రానుంది’ అని ప్రభాస్, రానా, అనుష్క వెల్లడించారు.ఇక ఈ వీడియోలో అనుష్క గురించి ప్రభాస్ (Prabhas) మాట్లాడుతూ.. ఓ ఫన్నీ విషయాన్ని పంచుకున్నారు. స్వీటీ నవ్వడం మొదలుపెడితే కనీసం 40 నిమిషాలు ఆపకుండా నవ్వుతుందని చెప్పారు. ఆమె రోజూ సెట్స్‌కు వచ్చేటప్పుడు ఈరోజు నవ్వకూడదు అనుకుంటూ వచ్చేదని.. నవ్వితే షూట్ మొత్తం ఆగిపోతుందని ఇంత పెద్ద సెట్ వేసిన నిర్మాతకు నష్టం కలుగుతుందని అనుకునేదని సరదాగా తెలిపారు. ఈ చిత్రం తనకు ఓ ఎమోషనల్ జర్నీ అని ప్రభాస్ భావోద్వేగానికి గురయ్యారు. ఇక సత్యరాజ్ మాట్లాడుతూ.. సెట్‌లో కాస్ట్యూమ్స్ చాలా ఉండేవని కనుచూపుమేరలో మొత్తం డ్రెస్‌లే ఉండేవని అదిచూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. ఏదేమైనా ‘బాహుబలి 3’ ఉంటుందని చెప్పడంతో అభిమానులు ఆనందిస్తున్నారు.గతంలో ‘ఆర్ఆర్ఆర్’ ప్రచారంలో రాజమౌళి (SS Rajamouli) మాట్లాడుతూ.. బాహుబలి 3 తీయడానికి అవకాశం ఉందని.. ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులో అయినా పార్ట్ 3 తీస్తానని అన్నారు. ఇప్పుడు మరోసారి నటీనటులు దీనిపై స్పష్టత ఇవ్వడంతో ‘వారణాసి’ తర్వాత జక్కన బాహుబలి మూడో భాగం పనులు ప్రారంభిస్తారని ఫ్యాన్స్

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,జూన్ 26**

మాచర్ల మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక అనే అంశాలపై ఏ.పీ. రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, వి.పి. సౌత్, మాచర్లలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాస కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. హేమాంబర్ రెడ్డి అధ్యక్షత వహించి విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్యాభ్యాసంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులతో పాటు వి.పి. సౌత్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సోమయ్య పాల్గొని మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టపరమైన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అరవింద బాబు కు సీపిఐ పార్టీ వినతి



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, నర్సరావుపేట, జూన్ 26;**

నరసరావుపేట పట్టణంలో వీధి దీపాలు సరిగ్గా వెలగక ప్రజలతోపాటు, పాద చారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నరసరావుపేట పల్నాడు రోడ్డు, గుంటూరు రోడ్డు, వినుకొండ రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, చిలకలూరిపేట రోడ్డు తోపాటు పలు రహదారుల వెంబడి వీధి దీపాలు లేకపోవడంతో మందు బాబులకు ఆ ప్రాంతాలు ఆవాస కేంద్రాలుగా మారాయి. అదేవిధంగా రహదారుల వెంబడి విద్యుత్ దీపాల పరిధిని పెంచాలని, దీంతో కొంతవరకైనా ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకునే విధంగా ఉంటుందని, సంబంధిత విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కారం చేయాలని సీపిఐ పార్టీ తరపున కోరుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాసా రాంబాబు (సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి), ఎస్కే చిన్న సైదా (సిపిఐ పట్టణ కార్యదర్శి) పలువురు సీపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ

### జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలలకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాలు



**నెల్లూరు, జూన్ 26: జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

జిల్లాలో అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాల సమయంలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాలు జారీ చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈ మేరకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టుల పిల్లలకు ప్రవేశాల సమయంలో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు, యాజమాన్యాలను సూచించారు.

అలాగే ఈ ఆదేశాల అమలుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధి కారులు, మండల విద్యాశాఖాధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

జర్నలిస్టులు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి, వారి కుటుంబాలకు విద్యా పరంగా ఊరటనిచ్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని సంబంధిత అధికారులు ఈ ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

## తొలి రోజే బారాసాహి దర్గా ప్రాంగణం వద్ద రొట్టెలు పంచుకుంటున్న దృశ్యాలు





**నెల్లూరు, జూన్ 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

శుక్రవారం ఉదయం నుంచి కోలాహలంగా బారాసాహి దర్గా ప్రాంగణం స్వర్ణాల చెరువులో రొట్టెలు పంచుకుంటున్న భక్తులు. వేల సంఖ్యలో భక్తులు హాజరై కోరిన కోర్కెలు తీర్చే విధంగా రొట్టెలను ఒకరికొకరు సహృద్భావ వాతావరణంలో పంచుకుంటున్నారు.

## టీడీపీ నేతకు నివాళులు అర్పించిన కూటమి నేతలు



**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,జూన్ 26**

విజయపురిసౌత్: తెలుగుదేశం పార్టీ విజయపురిసౌత్ యూనిట్ ఇంచార్జ్ కట్టారాజు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు.మాచర్ల శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అదేశాలతో మండల కూటమి నాయకులు కట్టారాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని కట్టారాజు కుటుంబానికి భరోసా కల్పించారు.నివాళులు అర్పించిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్,క్లస్టర్ ఇంచార్జ్ లు రామిశెట్టి సైదారావు,సుధాకర్ రెడ్డి,స్థానిక టీడీపీ



అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు,గంటా ధనుంజయరావు, బసివిరెడ్డి,బొబ్బిలి చంద్రశేఖర్,మస్తాన్,ప్రసాద్,కోట్ల సైదారావు,రాహుల్,రావుల శ్రీను ,రాంప్రసాద్,తదితరులు ఉన్నారు.

## చట్టబద్ధ పశు రవాణా రక్షణ కల్పించండి

**విజయనగరం:**

**జనసముద్రం న్యూస్ , జూన్ 26 :**




రాష్ట్రంలో చట్టబద్ధమైన పశువులు రవాణా వాహనదారులు పాడి రైతులు పశువులు కొనుగోలు అమ్మకం దారులు పశుసంతల నిర్వాహకుల తరుపున లీయగల్ లైవ్ స్టాక్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ తరఫున అధికారులకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నాం. రైతులు రవాణా దారులు పశువు వ్యాపారులను. కొంతమంది అధికారులు దళారులు ఒక్కటే పశు వులవ్యాపారుల వద్ద అక్రమ వసూల్ పాల్పడుతూ వ్యాపారులకు రైతులకు తీవ్ర అన్యాయాన్ని గుర్తిస్తున్నారు.

శ్రీకాకుళం విజయనగరం పార్వతీపురం తదితర జిల్లాల నుండి ప్రతిరోజు పశువులు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చట్టబద్ధంగా రవాణా చేయబడుతున్నాయి. ఈ రవాణా కోసం మేము ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన లైవ్ స్టాక్ వాహనాలు వినియోగిస్తున్నాం. మా వాహనాలు ట్రాన్స్పోర్ట్ ఆఫ్ అనిమల్స్ రూల్ 1978 సెంట్రల్ మోటార్ వెహికల్ రియాక్ట్ 1989 మార్గదర్శకాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రూపొందించబడ్డాయి వాహనాల్లో వెంటిలేషన్ డ్రైనేజ్ వ్యవస్థ తాగునీటి సౌకర్యం జంతువుల సంక్షేమానికి అవసరమైన అన్ని ఆస్పటల్ కల్పించబడింది జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు ద్వారా జారీ చేయబడిన డివిజన్ రూల్స్ 96 వెటర్నరీ హెల్త్ సర్టిఫికేట్లు సంబంధం అధికారుల అనుమతులు రవాణా శాఖ ధ్రువీకరణ పత్రం రాష్ట్రస్థాయి అధికారులు అనుమతులతోనే మేము పశువులను రవాణా నిర్వహిస్తున్నాము కేవలం పట్టబద్ధంగా అనుమతించబడిన ఎద్దులు గేదెలను మాత్రమే రవాణా చేస్తున్నాం.

అయిన మా వాహనాలను కొంతమంది వ్యక్తులు అడ్డుకుంటున్నారు అలాగే అక్షరం వస్తువులు కూడా చేస్తున్నారు హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో ఈ అక్షరం వస్తువులు చేసేవారు పశువుల రవాణాలను ఆపి డబ్బులు కట్టించుకునేవారు కానీ మేము ప్రభుత్వం నుండి పూర్తి అనుమతులు పొంది రవాణా చేస్తున్నప్పుడు ఎవరికి డబ్బు కట్టమని చెప్పి చెప్పడంతో వారు మా వాహనాల్లో అక్కడ ఆపి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారు అక్కడ ఉన్న జిల్లా సంబంధిత అధికారులు ఈ విషయాన్ని తీసుకొని వెళ్లి వారి ఫిర్యాదు చేశాం వారు అక్కడినుంచి మతం మార్చి విజయనగరం జిల్లా నుండి మానాపురం టోల్గేట్ దగ్గరకి కేంద్రంగా మతం మార్చారు డబ్బులు కట్టకపోతే ఈ జిల్లాలో ఇబ్బందులకు గురిచేస్తామని కొంతమంది అధికారులతో కలిసి వారిని ప్రలోభాలకు గురిచేసి మాపై తప్పుడు కేసులు పెడుతున్నారు లీగల్ రవాణా చేసే వాహనదాన్ని కాకుండా రైతులను కూడా అనేక ప్రజలు గుర్తు చేస్తున్నారు ఈ విషయంపై ప్రభుత్వము అధికారులు స్పందిస్తే గాని మాకు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మా వద్ద ఉన్న లీగల్ ట్రాన్స్పోర్ట్ పత్రాలన్నీ అధికారుల వద్ద చూపిస్తాం దానిలో ఏవైనా లోపాలుంటే వారి సరిచేసి మాకు అక్రమ ట్రాన్స్పోర్ట్ వసూల్ దారుల నుంచి న్యాయం చేయాలని కోరుతున్నారు ఈ కార్యక్రమంలో లీగల్ లైవ్ స్టాక్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మలిశెట్టి భరత్ రాఘవ పప్పు నవీన్ గింజల గణేష్ నానాజీ రొంగల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరుబా రా షాహిద్ దర్గా లో నిర్వహిస్తున్న రొట్టెల పండక్కు రాష్ట్రగుర్తింపు పండుగ ఇచ్చింది నారా చంద్రబాబు నాయుడు.

### రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, నెల్లూరు పట్టణ శాసనసభ్యులు పొంగూరు నారాయణ.





**నెల్లూరు, జూన్ 26, జనసముద్రం ప్రతినిధి..**

2014 - 19లో బారా షహీద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తింపు ఇచ్చారని రాష్ట్ర పురపాలక శాఖ మాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.

శుక్రవారం బారా షహిద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అభివృద్ధికి రొట్టెను పట్టుకున్న అనంతరంనిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 412 సంవత్సరాల చరిత్ర ఉన్న బారా షహిద్ దర్గాలో భక్తులు పెరుగుతున్నారు.2014లో 4 లక్షల మంది భక్తులు వచ్చేవారు, సరైన వసతులు ఉండేవి కావు.2014లో ఇక్కడ వసతులు పూర్తిగా పెంచాం,అభివృద్ధి చేసామన్నారు. ఈ సంవత్సరం సుమారుగా 15 లక్షల మంది రానున్నారని ఆయన తెలిపారు.

టూరిజం హబ్ గా నెల్లూరు బారా షహిద్ దర్గాను తీర్చిదిద్దుతున్నాం అని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి జనసముద్రం ప్రతినిధితో ప్రత్యేకఇంటర్వ్యూ ఇచ్చారు.

ఎంతో నమ్మకంతో దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు అని స్వర్ణాల చెరువులో నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాం. 6315 మంది మున్సిపల్ శాఖ సిబ్బంది, 1870 పోలీసులు, గజ ఈతగాళ్ళు, బోట్ షికారు కోసం 8 బొట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుదూర ప్రాంతాలనుండి, రాష్ట్ర నలుమూలల నుండి దేశ విదేశాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలు ఉన్నాయి.అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు.ఈ 5 రోజుల పండుగ తర్వాత కూడా మరో 5 రోజులు భక్తులు వస్తూనే ఉంటారన్నారు. అపరిశుభ్రత లేకుండా ఇక్కడ పరిశుభ్రంగా ఉంచాలని కోరుకుంటున్నాం.

ఈ సందర్భంగా ఆయనతో కలిసిన

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా రొట్టెల పండుగ కార్యక్రమంలో పాల్గొంటూ ఉన్నాను.చాలా అద్భుతంగా ఏర్పాట్లు చేశారు.2014 తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మంత్రి నారాయణ దర్గా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

టూరిజం స్పాట్ గా బారా షహిద్ దర్గాను తీర్చిదిద్దడం చాలా సంతోషంగా ఉంది.

మంత్రి నారాయణ ఆధ్వర్యంలో చెరువుని ట్యాంక్ బండ్ గా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాను.

మరో వక్త వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూకులమతాలకుఅతీతంగామతసమరస్యానికి ప్రతీకగా నెల్లూరు లో రొట్టెల పండుగ జరిగుతుంది

2014కి ముందు ఒకలా. 2014 తర్వాత వేడుకగా ఈ పండుగ జరుగుతోందన్నారు.మంత్రిగా నారాయణ, మేయర్ గా నేను ఉన్న సమయంలో దర్గా అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. అప్పట్లో మంత్రి నారాయణ సహకారంతో ఘాట్ లు నిర్మించాం, టాయిలెట్స్, షవర్లు ఏర్పాటు చేసాం. సిమెంట్ రోడ్లు, షెల్టర్లు నిర్మించాం.భక్తులకు చిన్న ఇబ్బంది జరగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసాం, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెంచాం.ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అతిధులని ఆదరిద్దాం.వారికి సహకరిద్దాం

27వ తేదీ రాత్రి గంధమహోత్సవం జరుగుతుంది. భారీగా భక్తులు వస్తారన్నారు.

వారితో పాటు నగర మేయర్ సుజాత నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, రిటైల్ పండగ చైర్మన్ మునీర్ అహ్మద్, మైనారిటీ నాయకులు, సయ్యద్ షమీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే మంచి భవిష్యత్తు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషా కిరణ్ రాయ్

### పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రతిభా పురస్కారాలు

**నెల్లూరు : జూన్ 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నగరంలోని టౌన్ హాల్లోని మినీ ఏసీ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డా " సీహెచ్ ఉషా కిరణ్ రాయ్, పీడబ్ల్యూఏ జాతీయ గౌరవాధ్యక్షులు జయ ప్రకాష్, క్రిస్టియన్ నాయకులు పాస్టర్ గూటం చంద్రశేఖర్, పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్ దయాసాగర్, బర్నబాస్, ఎం ఈ ఓ అబ్దుల్ హమీద్, స్వామిదాస్ తోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. టెన్త్ లో, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన 42 మంది విద్యార్థులకు షీల్డ్, మెడల్, సర్టిఫికేట్లను అతిథులు అందజేశారు.

**ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ,**

ఉత్తమ మార్కులు సాధించామని గర్వపడకుండా, వినయంతోపాటు సమాజాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. మంచి భవిష్యత్ మీకు రావాలని, ఉన్నతమైన స్థానాలు మిమ్మలను చూసి మేము ఆనందించాలన్నారు. అంతే కాదు మనకు శక్తిని బలాన్ని ఇచ్చే దేవుని మరిచి పోకూడదని, మీకు అనుక్షణం అండగా నిలిచి మీ శ్రమలో మీకు తోడుగా నిలిచిన మీ తల్లిదండ్రులను గౌరవించాలని హితవు పలికారు.

అవార్డులు పొందిన విద్యార్థులతో అసోసియేషన్ సభ్యులు గ్రూపు ఫోటో తీసుకున్నారు. అతిథులను సత్కరించారు. కార్యక్రమ నిర్వహణకు పని చేసిన అందరినీ అతిథులు సత్కరించారు.

చివరిగాదేవునిఆశీర్వాదాన్ని అందజేసి, జాతీయగీతం ఆలాపనతో కార్యక్రమాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జి. హనోక్,జాతీయ మీడియా కార్యదర్శి ఏ జయప్రకాష్,జిల్లా అధ్యక్షులు కే సుదర్శన్ రాజు, యాక్టింగ్ ప్రెసిడెంట్ రమేష్, ఉపాధ్యక్షులు వై. సదాశివరావు, జషువా, ప్రధాన కార్యదర్శి జే కిషోర్ కుమార్,కోశాధికారి సుదీర్ బాబు, కార్యదర్శి ఎనోష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సునీల్ గవాస్కర్, సహాయ కార్యదర్శులు సునీల్ కుమార్,శశి,ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్ జోసెఫ్, బి. ప్రభాకర్ తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అందరికీ ప్రేమ విందును ఏర్పాటు చేశారు.

**Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram**

జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
శనివారం,జూన్ 27,2026

# 1/70 చట్టాన్ని కాపాడుకుందాం - గిరిజనేతరుల దాడిని తిప్పి కొడదాం



**జిల్లా ఇంచార్జి, జన సముద్రం ,న్యూస్ తేది జూన్ 26**

అల్లూరిజిల్లా పాడేరు 1/70 చట్టాన్ని కాపాడుకుందామని, గిరిజనేతరుల దాడిని తిప్పి కొడదామని చింతపల్లి డివిజన్ ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ ఐక్య వేదిక నినదించింది.ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ ఐక్య వేదిక ఆద్వర్యంలో కొయ్యూరు మండల కేంద్రంలో గల గిరిజన ఉద్యోగుల భవన్ లో నర్సీ పాపారావు అధ్యక్షతన సమావేశమై 1/70 భూభదాలయింపు నిషేధ చట్టం సవరణ చేయాలని 1700 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్ట్ లో పిటిషన్ వేసిన నేపథ్యంలో ఈ చట్టం సవరణ చేయకుండా ఏ విధంగా న్యాయపోరటం, ప్రజాపోరాటం చేయాలో సమాలోచన చేసారు. 1/70 చట్టం చేసిన తర్వాత అధికారులు సక్రమంగా అమలు చేయలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆదివాసీ హక్కులు, చట్టాలు సక్రమంగా అమలు కాలేదని, బినామీల కారణంగా చట్టం ఆక్రమణకు గురౌవుతుందని, 1/70 చట్టం సవరణ చేయాలని గిరిజనేతరులు ఏకంగా సుప్రీంకోర్టు లో 1700 మంది కేసు వేయడం ఆశ్చర్యం గురి చేసిందని, ఇప్పటికే చాలామంది గిరిజనేతరుల దగ్గర ఆదివాసీల భూములున్నాయని, చట్టం సవరణ కానీ జరిగితే ఆదివాసీలం నిరాశ్రయులం అవుతామని,న్యాయ పోరాటం, ప్రజా పోరాటం చేయడానికి ఐక్యవేదిక ఆద్వర్యంలో గ్రామస్థాయిలోకి తీసుకొని వెళ్దామని, ఆదివాసీలందర్ని ఏకం చేయడమే లక్ష్యంగా పని చేద్దామని, త్వరలో గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయం తీసుకొంది.

ఈ కార్యక్రమంలో చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య,మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కంకిపాటి వీరన్నపడాల్, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు,విశ్రాంతి డిఎస్పీ కాకూరి బాలరాజు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ విభాగం రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్,చంద్రు క్రిష్ణ,బూరుగుల వెంకటరావు, శ్యామల వరలక్ష్మి, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవుడు, కార్యదర్శి సాగిన కోటిబాబు,శామ్యూల్ పడాల్,సలుమర్తి సూరిబాబు, ఉల్లి సూరిబాబు, అశోక్ లాల్, అచ్యుత్,పాటి చంద్రశేఖర్, రాజుబాబు, గోకిరి చిన్నరావు, పల్లాల అబ్బాయిరెడ్డి, ముల్ల నాగరాజు, వంజరి శంకురమ్మ, దేపూరి రాజుబాబు, వారా చిననూకరాజులతో పాటు పెద్ద ఎత్తున ఆదివాసీలు పాల్గొన్నారు.

# 'సర్' కార్యక్రమంపై నిర్లక్ష్యాన్ని వీడాలి..!

- అధికారులు సమయపాలన పాటించాలి..!
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి





**జనసముద్రంన్యూస్, వెల్దుర్తి, జూన్ 26;**

భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ జాబితా సవరణ కార్యక్రమైన 'సర్' పై నిర్లక్ష్యం వీడి, త్వరతిగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుకున్న సమయానికి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, లక్ష్యాలను అందుకోవాలని చెప్పారు. డోర్ టూ డోర్ ఓటర్ వెరిఫికేషన్ చేసి, నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు.

**అధికారులు సమయపాలన పాటించాలి..!**

సర్ ప్రోగ్రాంలో అధికారులు సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే జూలకంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ సైతం సర్ పై సీరియస్ గా పని చేస్తుంటే, కిందిస్థాయి అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. గ్రామాల్లో ఉదయం 11 గంటలకు డోర్ టూ డోర్ మొదలుపెడితే ప్రజలు ఎలా అందుబాటులో ఉంటారని, ప్రక్రియకు ఇంకా సమయం తీసుకోదా అని నిలదీశారు. దీనిపై ఐదు మండలాల ఎంపీడీవోలతో ఫోన్ ద్వారా సమీక్షించి, హెచ్చరించారు. నిర్దిష్టమైన లక్ష్యం పెట్టుకుని సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

# ప్రజా సమస్యలపై అధికారులు స్పందించాలి..!





- భూ కబ్జాలను క్షమించను..!
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

**జనసముద్రంన్యూస్, వెల్దుర్తి, పల్నాడు జిల్లా, జూన్ 26;**

ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు.

శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ లో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై సమర్పించిన అర్జీలను పరిశీలించి, వాటిని పరిష్కారించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిసారించారని, ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

**భూ కబ్జాలను క్షమించను..!**

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజల భూములను అన్యాయంగా లాక్కొని కబ్జాలకు పాల్పడిన ఏ ఒక్కరినీ ఎట్టి పరిస్థితుల్లో క్షమించనని ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరించారు. మాచర్ల పట్టణం 7వ వార్డుకు చెందిన మేకపోతుల నాగలక్ష్మి అనే బాధితులు తన ఇంటిని వైసీపీ నాయకుడు కోనంగి రవికుమార్ అనే వ్యక్తి చంపుతానని బెదిరించి 2023 లో కబ్జా చేశాడని, ఆనాడు అధికారాన్ని, అధికారులను అడ్డం పెట్టుకుని నాపై దాడికి యత్నించాడని ఎమ్మెల్యేకు ప్రజాదర్భార్ లో ఆర్జీ ద్వారా జరిగిన అన్యాయాన్ని విన్నవించింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను విచారించి, తక్షణమే పరిష్కరించాలని అర్బన్ సీఐ నజీర్ బేగ్, తహశీల్దార్ కిరణ్ ను ఆదేశించారు.

# ప్రజల ఆరోగ్యభద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయం..! ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

**జనసముద్రంన్యూస్, వెల్దుర్తి, పల్నాడు జిల్లా, జూన్ 26;**





ప్రజల ఆరోగ్యభద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.., ఆర్థికస్తోమత లేని అర్హులైన 45 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలను మెరుగుపర్చడంతో పాటు మరోవైపు శస్త్ర చికిత్సలకు సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంటు ప్రయాణం ప్రమాదకరం..










- అధికారుల పర్యవేక్షణ కరువు
- ప్రయాణికుల్లో ఆందోళన

**నరసాపురం జూన్ 26 జనసముద్రం**
**పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**

నరసాపురం ప్రాంతంలో నరసాపురం నుంచి సఖినేటిపల్లి కి గోదావరి నదిపై నడిచే పంటు (ఫెర్రీ)లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం పై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల భద్రత కోసం అందుబాటులో ఉండాల్సిన సేఫ్టీ జాకెట్లను వినియోగానికి సిద్ధంగా ఉంచకుండా గాల్లో వేలాడదీసి ఉంచడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రన్నింగ్ లో ఉన్న పంటలకు మానేసి ఖాళీగా పక్కన పెట్టిన పంటులో సేఫ్టీ జాకెట్లు ఉంచడం కొన్ని రేవు పక్కన పడేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఉపయోగించాల్సిన సేఫ్టీ జాకెట్లు ఈ విధంగా ఉండటంతో ప్రమాదం సంభవిస్తే ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటులో భద్రతా నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే విషయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పుష్కరాల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో పంటు సేవలను వినియోగించే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున, వెంటనే భద్రతా ఏర్పాట్లను మెరుగుపరచాలని, ప్రతి ప్రయాణికుడికి అందుబాటులో సేఫ్టీ జాకెట్లు ఉంచాలని, అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఘనంగాపర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు.








**నెల్లూరు, జూన్ 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

ఉపాధ్యాయుల శాసన మండల సభ్యులు, కృష్ణ చైతన్య విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్, పట్టణ వైయస్సార్సీపి పట్టణ ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా పట్టణంలోని నగర సిటీ కార్యాలయంలో వైయస్సార్సీపి సీనియర్ నాయకులు మాజీవిజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డిరంగారెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి, కేకును కట్ చేయించారు. కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి ఒక విద్యాసంస్థల అధినేతగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. శాసనమండలిలో కూడా అధికారపక్షంలో జరిగిన తప్పులను సమర్థవంతంగా ప్రశ్నించే ఘనత తనకే దక్కిందన్నారు. నెల్లూరు నగరపాలక సమస్తల్లో జరిగిన లోటుపాట్లను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకపోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నియమించిన ఉపాధ్యాయ నియామకాలు కూడా చాలా అవకతవకలు జరిగాయని ఆయన అనేక జరిపారు. జన్మదిన సందర్భంగా స్వయంగా వేడుకల్లో పాల్గొనక పోయిన కార్యకర్తలు అత్యుత్సాహంతో సిటీలోని పలు వార్డుల్లో నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన కేకును కట్ చేసి, అన్నదానం వస్త్ర దానం నిర్వహించారు. దీర్ఘ ఆయేషాలతో ఉండి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కార్యకర్తలు నెల్లూరు నగర ఆధ్వర్యంలోని ఉన్న దేవాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిటీ కార్యాలయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

# వార్షిక బ్రహ్మోత్సవ మహోత్సవములు.

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి.**
**సుబ్రమణ్యం. జూన్.26.**





గుడివాడ పట్టణం పాటిమీద జగన్నాధపురంలో వెంచేసి యున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంనందువార్షికబ్రహ్మోత్సవమహోత్సవముల లో భాగముగా ఈరోజు ఉదయం కుంభారాధన లక్ష్మీనారాయణ యాగం మరియు నండూరి బద్రీనాథ్ శారదా దేవి దంపతుల సహకారంతో శ్రీ స్వామి అమ్మవార్లకు 108 కలశములతో పంచామృత అభిషేక కార్యక్రమము అత్యంత వైభవోపేతముగా నిర్వహించబడినది అని సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం మరియు శేష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి రాయబారం మహోత్సవ కార్యక్రమంలో బొచ్చు నాగేశ్వరావు సీతామహాలక్ష్మి దంపతుల కుటుంబ సభ్యులచేనిర్వహించబడినదిఅనికార్యనిర్వహణాధికారి క కందుల వేణుగోపాలరావు ధర్మకర్తల మండల చైర్మన్ శ్రీ లింగం శివరాం ప్రసాద్ తెలియజేసి ఉన్నారు. సదురు కార్యక్రమంలో అన్నియు ఆలయ అర్చక స్వామి శ్రీ వేదాంతం అప్పలాచార్యులు మరియు షణ్ముఖ ద్వారకా శ్రీనివాస్ ఆచార్యులు పర్యవేక్షణలో నిర్వహించబడినవి. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండల సభ్యులు నిమ్మగడ్డ వెంకట రామకృష్ణారావు, చందు శ్రీనివాసరావు, వేదాంతం కృష్ణవేణి, రాజేశ్వరరావు, సాంబశివరావు మరియు ఆండాల్ గోస్ట్ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉన్నారు.

# అసత్యం,అన్యాయం, నియంతృత్వానికి వ్యతిరేకంగా నిలబడి ధర్మ పరిరక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన ఇమామ్ హుస్సేన్






**జనసముద్రం న్యూస్ పామర్రు నియోజకవర్గం.**
**ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. జూన్.26.**

(అ. స)జీవిత గాథ నేటికీ మానవాళికి ఆదర్శంగా నిలుస్తోంది..త్యాగానికి ప్రతీక మొహర్రం..

మొహర్రం మాసం పదవ రోజు సందర్భముగా పమిడిముక్కల మండలం అలినఖిపాలెంలో శుక్రవారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో పెద్ద ఎత్తున మొహర్రం నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి ప్రతీక మొహర్రం ప్రాణ త్యాగం చేసిన కర్బలా అమరవీరులను స్మరించుకోవటమే మొహర్రం. దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా పోరాడి ధర్మం వైపు నిలిచిన వారి ప్రాణం త్యాగానికి ప్రతీక మొహర్రం నిర్వహించారు.

పది రోజులు భాగంగా మౌలానా సయ్యద్ ఫార్మాన్ ఆబేది గురువు ఆధ్వర్యంలో ఇమామ్ హుస్సేన్ మరియు కుటుంబ సభ్యుల గురించి ఉపన్యాసాలు వినిపించారు. పదవరోజు ఇమామ్ హుస్సేన్ కమిటీ సంఘం పెద్దల ఆధ్వర్యంలో కర్బలా స్ఫూర్తి నిర్వహిస్తూ 10వ రోజు (ఆశురా) రోజు మొహర్రం పర్వదినం రోజున షియా మతస్తులు శోక గీతాలు ఆలపిస్తూ యా హుస్సేన్, యా అబ్బాస్ అంటూ చిన్నారులు, యువకులు, పెద్దలు, జంజీర్లు, బ్లేడ్లుతో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ చెస్ట్ బీటింగ్ లో పాల్గొన్నారు. మాతం నిర్వహిస్తూ గ్రామంలో పీర్లను ఊరేగించారు. హుస్సేనీ కమిటీలో మత గురువు సయ్యద్ ఫార్మాన్ ఆబేది ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. హుసైని కమిటీ అధ్యక్షుడు మిర్జా జైనుల అబేద్దీన్ కార్యదర్శి మీర్జా నజరే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మిర్జా మాజేద్ రజా ఆశూర్ఖానాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

# 5వ వార్డు చెన్నకేశవ కాలనీ లో జరిగిన సైడ్ కాల్వలు క్లీనింగ్ కార్యక్రమం





**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూన్ 26;**

మాచర్ల పట్టణంలోని ఐదవ వార్డు చెన్నకేశవ కాలనీలో మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి ఆలేటి వాసు సైడ్ కలవాలని కూడా శుభ్రం చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.